## శాంతిభద్రతలకు విఘాతం కల్గకుండా చర్యలు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** బక్రీదు పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కల్గకుండా మరియు జంతువుల అక్రమ రవాణాను అరికట్టుట కొరకు జిల్లాలో 10 చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...బక్రీద్ పండుగ సందర్భంగా గోవులు, లేగదూడల అక్రమ రవాణాను చేయవద్దని జిల్లాలో శాంతిబద్రతలు, జంతు అక్రమ రవాణాను అరికట్టుకటకు జిల్లాలో వికారాబాద్ , దారుర్, పరిగి , తాండూరు, యాలాల పోలీస్ స్టేషన్‌ల పరిధిలలో మొత్తం 7 అంతర్ జిల్లా చెక్ పోస్ట్‌లు మరియు బషీరాబాద్ పోలీస్ స్టేషన్ , కరణ్ కోట్ పోలీస్ స్టేషన్, కొడంగల్ పోలీస్ పరిధిలలో 3 అంతర్ రాష్ట్ర చెక్‌పోస్ట్‌లు మొత్తం జిల్లాలో 10 చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేయడం జరిగింది. పశువుల వ్యాపారులు పశువుల క్రయ, విక్రయాలలో భాగంగా ఖచ్చితంగా నియమా నిబంధనలు పాటించాలని, ఎవరైనా పశువులను అక్రమంగా రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకో బడతాయని ఎస్పీ హెచ్చరించారు. ఇట్టి అక్రమ రవాణా చేస్తున్నట్లు ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీస్ అధికారులకు కాని డైల్ 100కి గాని సమాచారం అందించాలని, అలా కాకుండా వారిపై బౌతికంగా దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

### -జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :**

ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా, అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీ కేజీబివి వసతి గృహాలు, గురుకులాల నిర్వహణపై సంక్షేమ అధికారులు, గురుకులాల ప్రిన్సిపాల్‌లు, కేజీబివి ప్రత్యేక అధికారులచే సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వ ఉద్యోగులుగా విధి నిర్వహణలో ఎన్నో మంచి పనులు చేసే అవకాశం ఉంటుందని దీన్ని సద్వినియోగం చేసుకొని మనసుకు సంతృప్తినిచ్చే విధంగా మనసు పెట్టి పనిచేయాలన్నారు. ప్రభుత్వం వసతి గృహాల నిర్వహణలో భాగంగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎంతో డబ్బును వెచ్చిస్తుందని అయినప్పటికి ఉత్తీర్ణత శాతం అనుకున్న స్థాయిలో లేకపోవడం దురదృష్టకరమని కలెక్టర్ అన్నారు. మనం పొందుతున్న జీతానికి న్యాయం చేస్తున్నామా? పని చేయకపోవడం వల్ల ఈ పిల్లల భవిష్యత్తు ఏంటి అనే కోణంలో ఆలోచించి వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని అధికారులకు హితువు పలికారు. వసతి గృహాల్లోని విద్యార్థుల ఉత్తీర్ణత ఈ దఫా 70 శాతానికి తగ్గకుండా పని చేయాలని ఆయన తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ



పాఠశాలలు కూడా పోటీ పడాలని ఆయన అన్నారు. వసతి గృహాలు, గురుకుల పాఠశాలలకు విద్యార్థులు వచ్చేసరికి పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. పారిశుధ్య పనులు చేపట్టేందుకు విలువ గ్రామపంచాయతీ , మున్సిపాలిటీ సిబ్బంది సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

**తల్లిదండ్రుల పాత్రను పోషించాల్సింది మనమే**
**: జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి**

దారిద్రరేఖకు దిగువనున్న గ్రామీణ, మద్యతరగతికి చెందిన అత్యంత పేద కుటుంబాల పిల్లలు వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తారని, తల్లిదండ్రుల పాత్రను పోషిస్తూ వారి బాగోగులను చూడాల్సిన బాధ్యత కూడా సంబంధిత అధికారులదేనని కలెక్టర్ అన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కనీస అవసరాలైన మంచినీరు,



విద్యుత్తు, టాయిలెట్స్, ఫ్యాన్లు, తలుపులు కిటికీలు ఉండేవిధంగా ముందస్తుగా చూసుకోవాలని తెలిపారు. ఏవైనా మరమ్మత్తులు ఉంటే నిధులు మంజూరు కోసం ప్రతిపాదనలు సమర్పించినట్లయితే అనుమతులు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. వసతి గృహాల్లో సబ్జెక్టుల వారీగా ట్యూటర్లను నియామకం చేసుకొని రాజీ పడకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు ఉత్తీర్ణతపైన మంచి విశ్వాసాన్ని తీసుకువచ్చి మంచి ఫలితాలు సాధించేలా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం, వెనుకబడిన కులాల అభివృద్ధి అధికారి ఉపేందర్, టిజిఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్ రిజినల్ కోఆర్డినేటర్ శారద వెంకటేష్, పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో గృహజ్యోతి దరఖాస్తులు పరిష్కరమయ్యేనా..?

### -రైతులకు జిరో బిల్ రాలేదని ప్రభుత్వంపై రైతులు మండిపాటు



ప్రజాపాలనలో రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు పాత ఫైల్ (ఫోటో)

**కోట్‌పల్లి, జూన్ 11, ప్రభాతవార్త;**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడి ఏడు నెలలు అవుతుంది. మొట్ట మొదటిగా గ్రామాలల్లో ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలకు ప్రతి గ్రామంలో అధికారులు వెళ్లి ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరించి దాదాపు 6, నెలలు అవుతుంది. ఇందులో ఆరు గ్యారంటీలకు ప్రజా పాలనలో ప్రజల నుంచి మహాలక్ష్మి పథకం, రైతుభరోసా పథకం, గృహజ్యోతి పథకం, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకం వంటివి రైతులు వద్ద నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కానీ గృహజ్యోతి పథకం కింద రైతులకు జిరో బిల్‌కు ఎమ్మెల్సీ, ఎంపీ, ఎన్నికల కోడ్ ఉండటంతో జిరో బిల్ రాలేదు...జూన్ 5న ఎన్నికల కోడ్ తీయడంతో గత రెండు రోజుల కిందట మండల కేంద్రంలోని బార్వాద్ సబ్ స్టేషన్ పరిధిలో మోత్కుపల్లి, బార్వాద్, బార్వాద్‌తాండ, నాగసాన్‌పల్లి, నాగసాన్‌పల్లితాండ, కరీంపూర్, బీరోల్ గ్రామాలల్లో కొంత మంది రైతులకు జిరో బిల్ రావడం లేదు విద్యుత్తు అధికారులకు అడిగితే ఎంపీడీఓ ఆఫీస్‌కు వెళ్ళి మళ్ళి దరఖాస్తులు చేసుకోవాలని చెబుతున్నారని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా పాలనలో దరఖాస్తులు నిరంతరం ప్రక్రియ అన్ని ప్రభుత్వం చెబుతున్న ఇక్కడ మాత్రం ఎలాంటి ఎంట్రి చేయడం లేదని రైతులు వాపోతున్నారు. బార్వాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని దాదాపు 1200, పైగా విద్యుత్తు కానెక్షన్‌లు ఉన్నాయి ఇందులో దాదాపు, 250, పైగా ఎంట్రీలో తప్పుగా ఎంట్రీ చేయడంతో జిరో బిల్ రాలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులు గృహజ్యోతి పథకం కింద దరఖాస్తులు చేసుకున్న రైతుల జిరో బిల్ సమస్య పరిష్కరించాలని పలు గ్రామాల రైతులు పేర్కోంటున్నారు. ఎంపీడీఓ డ్యానియోల్, వివరణ కోరగా ప్రజా పాలనలో దరఖాస్తులు వచ్చిన ప్రతి ఒక్కటి ఎంట్రీ చేయడం జరిగింది. కానీ ఇక్కడ మళ్లి ఎంట్రీ చేయాలనిమాకు ఇంత వరకు ఎలాంటి గైడ్‌లైన్స్ అయితే రాలేదు. కానీ జిరో బిల్ విషయం మాపై అధికారుల తెలియజేసి సమస్యను పరిష్కరించెందుకు చర్యలు తీసుకుంటాం, ఎవరికైన జిరో బిల్ రాలేదో దరఖాస్తులు నింపి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, విద్యుత్తు బిల్ జత చేసి ఇస్తే పరిష్కరించెందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అయన పేర్కొన్నారు.

## ఆశాలకు ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి

### -సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్



డిప్యూటి డిఎంహెచ్‌వోకు వినతి పత్రం అందజేస్తున్న అల్లి దేవేందర్, ఆశాలు.

**చేవెళ్ల, జూన్ 11 ప్రభాతవార్త :**

ఆశాలకు ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేవెళ్ల మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలకు నష్టం కలిగించే ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిప్యూటి డిఎంహెచ్‌వోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆశా కార్యకర్తలు గత 33 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని ఆశా కార్యకర్తల పని ప్రారంభం నుండి ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగ్‌లు పొందారని, రిజిస్టర్స్ రాయడం సర్వేలు చేయడం అన్లైన్ పని బీపీ షుగర్, థైరాయిడ్ తదితర అన్ని రకాల జబ్బులను గుర్తిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులను ప్రజలకు అందజేస్తున్నారు. వీటితో పాటు గర్భిణీలు బాలింతలు చిన్న పిల్లలను ఇతర ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియూ చేవెళ్ల మండల అధ్యక్ష కార్యదర్శులు అన్నపూర్ణ, విజయలక్ష్మి, కోశాధికారి ఉమా, మంజుల, శాంత, సుజాత, పావని, సుజాత, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



జడ్పి సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కలెక్టర్ కె.శశాంక.

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, జూన్ 11 ప్రభాతవార్త :**

మంగళవారం రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జిల్లా కలెక్టర్ కె.శశాంక, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ అనితాహరినాథ్ రెడ్డి మాట్లాడుతూ... ఈ సర్వసభ్య సమావేశం చివరిదని, గడిచిన ఐదు సంవత్సరాలు సమీక్షలు సుదీర్ఘంగా నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజల సమస్యలపై పోరాడటం, తీర్మాణాలను చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఎంపిడివోలు, నోడల్ అధికారులతో సమస్యలపై చర్చించి పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఈ ఐదు సంవత్సరాలు సహకరించిన జడ్పిటిసిలు, ఎంపిపిలు, జిల్లా అధికారులకు కృతజ్ఞత తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖపై సమీక్షిస్తూ జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు, సంబంధిత సిబ్బంది లేకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఖచ్చితంగా వైద్యులు, సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని, ఆఫరేషన్ థియేటర్‌లలో నీరు, ఏసీలు, కావాల్సిన వసతులు ఉండేలా చూడాలని, ప్రతి ఆసుపత్రిలో కావాల్సిన సదుపాయాలు ఉండేలా చూసుకోవాలని సభ్యులు అధికారులకు కోరారు. వైద్యుల డిప్యూటేషన్‌ను రద్దుచేస్తూ తీర్మానం చేయాలని సభ్యులు కోరగా జిల్లా కలెక్టర్ శశాంక స్పందిస్తూ డిప్యూటేషన్‌లు శాఖ పరమైన నిర్ణయమని తెలిపారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఖచ్చితంగా డాక్టర్లు, సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని, ప్రతి ఆసుపత్రిలో కావాల్సిన సదుపాయాలు ఉండేలా చూస్తామని తెలిపారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యాశాఖపై సమీక్షిస్తూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని తగిన చర్యలు తీసుకోవాలని, నీటి సౌకర్యం, స్కావెంజర్‌లను నియమించాలని సభ్యులు కోరారు. అందుకు అధికారులు స్పందిస్తూ పుస్తకాలు, యూనిఫామ్స్ అందించడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ శాఖపై సమీక్షిస్తూ రైతులకు నకిలీ విత్తనాలు ఎరువులతో ఇబ్బందులు కలగకుండా వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని సభ్యులు కోరగా అందుకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి స్పందిస్తూ పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు అందరూ కలిసి తనిఖీలు నిర్వహించి పర్యవేక్షించడం జరుగుతుందని వివరించారు. విద్యుత్ శాఖపై సమీక్షలో భాగంగా గాలివానలకు విద్యుత్ పోవడం జరుగుతుందని, సంబంధిత ఏఈలు, లైన్ మెన్లు స్పందించడం లేదని, పాత స్తంభాలు తొలగించాలని, కిందకు వేళ్లాడుతున్న వైర్లను సరిచేయాలని, రానున్నది వర్షాకాలంలో జిల్లాలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను సభ్యులు కోరగా, తప్పకుండా పరిష్కారిస్తామని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. షాద్‌నగర్ శాసన సభ్యులు, వీర్లపల్లి శంకర్, మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడుతూ...మంచినీటి కొరత లేదని,, కానీ గ్రామాల్లో వాల్స్, కంట్రోల్ వాల్స్ లేవని, నిర్వహణ సరిగా లేదని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## అధిక ఫీజులను నియంత్రించండి

### -జడ్పిటిసి నేనావత్ అనురాధపత్యానాయక్

**ఆమనగల్లు, జూన్11, ప్రభాతవార్త:** కార్పోరేట్ విద్యా సంస్థల్లో అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, వాటిని నియంత్రించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆమనగల్లు జడ్పీటీసీ నేనావత్ అనురాధపత్యానాయక్ అన్నారు. అధిక ఫీజులతో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన ప్రతిభ కల్గిన విద్యార్థులు ఫీజులు చెల్లించుకోలేక అర్థాంతరంగా మధ్యలోనే చదువులకు దూరమవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం జరిగిన రంగారెడ్డి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ అనురాధపత్యానాయక్ పాల్గొన్నారు. అనంతరం ఆమె ప్రైవేటు, కార్పోరేట్ విద్యాసంస్థల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులు, గుర్తింపు లేని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మైసిగండి మైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు

**కడ్తాల్, జూన్ 11 ప్రభాతవార్త :**

కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయంలో మంగళవారం రంగారెడ్డి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ టి. శేఖర్, ఆలయ ఫౌండర్ ట్రస్టు ఛైర్మన్ సిరోలి పంతునాయక్, ఈఓ స్నేహలత ఆధ్వర్యంలో 75 రోజుల హుండీ లెక్కింపులో భాగంగా రూ. 1517494 (పదిహేను లక్షల పదిహేడు వేల నాలుగు వందల తొంబై నాలుగు రూపాయలు మాత్రమే) ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు ఆర్‌పి భాస్కర్, వి. అరుణ్, ముఖ్య అర్చక : మాదారం యాదగిరి సిబ్బంది ఎం. బొడియా నాయక్, జి.క్రిష్ణ, బి. చంద్రయ్య, జి. రాములు, జి. దేవేందర్, జి. రమాదేవి, ఎస్. శ్రీనివాసులు, ఎం. మహేష్, ఎ.పత్యానాయక్, కె. హర్షవర్ధన్, ఎస్. కృష్ణయ్య, బిబిచారి, డిష్ శ్రీను, ఆలయ సిబ్బంది మరియు కెనరా బ్యాంక్ సిబ్బంది లక్ష్మీనారాయణ, పోలీస్ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మైసిగండి మైసమ్మ అమ్మవారి ఆలయ హుండీ లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

## మున్సిపల్ బిల్‌కలెక్టర్ హేమంత్‌కుమార్ రిమాండ్

### -పన్నుల వసూలు డబ్బులు దుర్వినియోగం

### -రూ.3,13,03,082లు స్వాహా కేసు

**ఘట్‌కేసర్, జూన్ 11, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మున్సిపల్‌లో ప్రజల నుంచి వసూలు చేసిన ఇంటిపన్నులను దుర్వినియోగం చేసిన బిల్‌కలెక్టర్ హేమంత్ కుమార్‌ను అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ రామునాయక్ తెలిపారు. ఘట్‌కేసర్ పురపాలకసంఘంలో 2007 నుంచి కొంపల్లి హేమంత్‌కుమార్ బిల్‌కలెక్టర్‌గా పనిచేస్తున్నాడని, ప్రతిరోజు ఇంటి పన్నులు, ట్రేడ్‌లైసెన్స్‌లకు సంబంధించిన డబ్బులను వసూలు చేసి డబ్బులు ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఖాతాలో జమచేసేవాడని తెలిపారు. కాగా 2021 నుంచి 2023 వరకు వసూలు చేసిన పన్నులకు డబ్బులు రూ. 3,13,03,082లను మున్సిపల్ ఖాతాలో జమచేయలేదని తెలిపారు. దీనికి సంబంధించి 2023 ఆగష్టులో ఆడిటింగ్ జరుగగా మున్సిపల్ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమకాలేదని అధికారులు గుర్తించారు. విచారణ జరిపిన అధికారులు పైఅధికారులకు నివేదిక ఇవ్వడంతో పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ సీడీఎంఏ ఆదేశాల మేరకు హేమంత్‌కుమార్‌ను విధుల నుంచి తొలగించారు. మున్సిపల్ కమీషనర్ సాబేర్‌అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరిపట్లు తెలిపారు. అన్ని కోణాలలో పోలీసులు విచారణ నిర్వహించి ప్రజలకు సేవలందించాల్సి బిల్‌కలెక్టర్ నిధులు దుర్వినియోగం చేశాడనే అభియోగం నిర్ధారణ కావడంతో నిందితున్ని అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈకేసులో ఇంకా కొంతమందిని విచారించేందుకు నిందితుడు హేమంత్‌కుమార్‌ను కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకొని విచారించనున్నట్లు ఎస్ఐ రామునాయక్ తెలిపారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎంపి,ఎమ్మెల్యే



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే

**కడ్తాల్, జూన్ 11 ప్రభాతవార్త :**

బటర్‌ఫ్లై సిటీ వెంచర్‌లో ఇటీవల జరిగిన జంట హత్యల కుటుంబాలను మంగళవారం నాగర్‌కర్నూల్ ఎంపి మల్లురవి, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. గోవిందాయపల్లి గ్రామానికి చెందిన శేషుగారి శివ, గుండెమోని శివ ఇటీవల హత్యకు గురయ్యారు. ఇరు కుటుంబాలను గ్రామంలో ఎంపి, ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. హత్యలకు పాల్పడిన నిందితులకు చట్ట ప్రకారం సరైన శిక్ష పడుతుందని అన్నారు. బాధిత ఇరు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున మొత్తం 20 వేల ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా అదే గ్రామానికి చెందిన ఆత్మహత్య చేసుకున్న మహిళ కుటుంబ సభ్యులను వారు పరామర్శించి రూ. 5 వేల సాయం అందించారు. ఎంపి, ఎమ్మెల్యే వెంట పిసిసి సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా నాయకులు బిక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, కాంగ్రెస్ నాయకులు భాస్కర్‌రెడ్డి, చేగూరి వెంకటేష్, జహంగీర్‌అలీ, వేణుగోపాల్, కిసాన్‌సెల్ బాల్‌రాజ్, శ్రీనివాస్, రాజేష్, శబ్బు పాల్గొన్నారు.

## విత్తన నిల్వ గోదాంల తనిఖీ



శామీర్‌పేట మండల పరిధిలో విత్తన కంపెనీ, నిల్వ గోదాములను, షాపులను తనిఖీలు చేసిన జిల్లా టాస్క్‌ఫోర్సు టీమ్, వ్యవసాయ అధికారులు

**శామీర్‌పేట, జూన్ 11, ప్రభాతవార్త**

శామీర్‌పేట మండల పరిధిలోని వివిధ విత్తన కంపెనీలు, నిల్వ గోదాంలను, విత్తన షాపులను జిల్లా టాస్క్‌ఫోర్సు టీమ్ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. మంగళవారం శామీర్‌పేట మండల, తూంకుంట మున్సిపల్ పరిధిలో ఉన్న విత్తన నిల్వ గోదాములను, షాపులను వారు సందర్శించి తనిఖీలు చేశారు. రికార్డులను, స్టాక్‌ను వారు పరిశీలించి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగ పాల్గొన్న ఏడిఎ వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేయాలన్నారు. గుర్తింపు పొందిన కంపెనీలు మాత్రమే విత్తనాలు అమ్మాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదులు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు ఉంటాయన్నారు. రైతులు తప్పనిసరిగా రశీదు పొందాలని, పంటకాలం వరకు భద్రంగ ఉంచాలని రైతులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్సు టీమ్‌లో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ ఎన్.జానయ్య, ఎ.ఒ రమేశ్, విత్తన దృవీకరణ అధికారి మహేశ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

### - తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు
### - వివాదాస్పద భూమిని స్వాధీనం చేసుకున్న అధికారులు

**తాండూరు, జూన్11, ప్రభాతవార్త :**

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. తాండూరు పట్టణంలో వివాదాస్పదంగా మారిన విజయ విద్యాలయ స్కూల్ ఆటస్థలాన్ని రెవెన్యూ అధికారులు స్వాదీనం చేసుకున్నారు. ఆ స్థలం ప్రభుత్వ భూమిగా బోర్డును ఏర్పాటు చేశారు. తాండూరు మండల తహసీల్దార్ తారాసింగ్ దగ్గరుండి ప్రభుత్వ భూమి అంటూ బోర్డును ఏర్పాటు చేయించారు. ఈ విషయంపై ఆర్డీఓ శ్రీనివాస్‌రావు ఓ ప్రకటనలో మాట్లాడుతూ.. తాండూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని విజయ విద్యాలయ స్కూల్ పక్కన ఆక్రమణకు గురైన 17గుంటల భూమి సర్వే నెం.111కు చెందిందని అన్నారు. ఇట్టి సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డులలో ఉందని తెలిపారు. ఈ సర్వే నంబర్‌లో 14ఎకరాల 14గుంటల ప్రభుత్వ భూమి ఉందని అన్నారు. ప్రస్తుతం ఆర్డీఓ కార్యాలయంలోని కొంత స్థలంతో పాటు విజయవిద్యాలయ పాఠశాల, ఆక్రమణకు గురైన స్థలం, ఆర్‌అండ్‌బి రోడ్డు, మరికొన్ని ఇండ్లు ఈ సర్వే నంబర్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ వివాదాస్పద భూమిలో పసారం లలిత్, సందీప్, నిశాంక్ తదితరులు కోర్టు మధ్యంతర ఉత్తర్వులతో పెన్సింగ్ ఏర్పాటు చేసి బోర్డును ఏర్పాటు చేశారని అన్నారు. రెవెన్యూ రికార్డులలో ప్రభుత్వ భూమిగా తేలడంతో బోర్డును తొలగించి ప్రభుత్వ భూమిగా బోర్డును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కోర్టు అంతిమ తీర్పు వచ్చే వరకు ఈ స్థలంలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టరాదని, కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. నిబంధనలకు అతిక్రమించి ఈ స్థలంలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆర్డీఓ హెచ్చరించారు.



ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు.

**అమాయకులపై దుష్ప్రచారం తగదు..**
**- మా స్థలాన్ని కాపాడుకోవడమే మా ప్రయత్నం**
**- పసారం బస్వరాజ్, నిశాంక్**

మా సొంత భూమి విషయంలో అమాయకులమైన తమపై దుష్ప్రచారం తగదని పసారం బస్వరాజ్, నిశాంక్‌లు అన్నారు. మా స్థలాన్ని కాపాడుకోవడమూ ప్రయత్నంగా ముందుకు సాగుతామని తెలిపారు. స్వాతంత్రానికి పూర్వం నుండి సర్వే నెంబర్ 111లో తమ కుటుంబీకుల పేరుపై భూమి ఉందని అన్నారు. అప్పట్లో విద్యాభివృద్ధికి స్థలం కావాలని కోరడంతో 200గజాల స్థలాన్ని విజయ విద్యాలయ స్కూల్‌కు కేటాయించారని తెలిపారు. మిగతా 16గుంటల భూమి మా కుంటుంబీకుల పేరుపై ఉందని అన్నారు. ఇట్టి స్థలాన్ని కొందరు కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని తెలిసి స్థలాన్ని కాపాడుకోవాలని పెన్సింగ్ వేయించామని తెలిపారు. ఇది గిట్టని కొందరు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. భూమికి సంబందించిన అన్ని రిజిస్ట్రేషన్ పత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ స్థలంపై కాపాడుకునేందుకు న్యాయ పోరాటానికి సిద్దమని అన్నారు.

# 59.5 కిలోల గంజాయి పట్టుకున్న రైల్వే పోలీసులు

**వికారాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:**

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు పట్టుకున్న సంఘటన వికారాబాద్ రైల్వే జంక్షన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం సమయంలో రైల్వే పోలీసులు వికారాబాద్ రైల్వే స్టేషన్‌లోని 2, 3 ప్లాట్ ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇద్దరు యువకులు కొన్ని లగేజ్ బ్యాగులతో అగుపించారు. పోలీసులు వారిని తనిఖీ చేస్తుండగానే ఓ యువకుడి అక్కడి నుంచి పరారయ్యాడు. మరొక యువకుడు పారిపోయే ప్రయత్నం చేయగా..పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వారి లగేజ్ బ్యాకుగలను తనిఖీ చేయగా, 59.5 కిలోల గంజాయి పట్టుబడింది. పట్టుబడ్డ యువకుడు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సందీప్‌కుమార్ గా నిందితుడు తెలిపారు. దీంతో నింధితుడిని అదుపులోకి తీసుకోవడంతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో రైల్వే సీఐ రాజేంద్రప్రసాద్, ఎస్ఐ శంకరయ్య రైల్వే పోలీసులు ఉన్నారు.



రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు




కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీలో ఎంపి సురేశ్‌కుమార్ శెట్కార్

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎంపి విజయోత్సవ ర్యాలీ

### -పాల్గొని అభివాదం చేసిన ఎంపి శెట్కార్

**జహీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌కుమార్ శెట్కార్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బిబి పాటిల్‌పై ఘన విజయం సాధించినందుకు మంగళవారం జహీరాబాద్ పట్టణంలో మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భారీగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని బాగారెడ్డి చౌరస్తా (బాగారెడ్డి విగ్రహం) నుంచి విజయోత్సవ ర్యాలీ ప్రారంభం అయి జాతీయ రహదారి గుండా పట్టణంలోని శెట్కార్ ఫంక్షన్ హాల్ వరకు కార్యకర్తల జయ జయ ధ్వానాలతో ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాములు యాదవ్, కండెం నర్సింలు, నరసింహారెడ్డి, సురేశ్‌కుమార్ శెట్కార్ కుమార్తె గిరిజా శెట్కార్, హనుమంతరావు పాటిల్, రామలింగారెడ్డి, బిరాదార్ శ్రీనివాస్‌రెడ్డి, మక్సుద్, అశోక్ అప్పారావు, శుక్ల వర్ధన్‌రెడ్డి, నరేశ్‌గౌడ్, ఎండి ఖాజా మియా, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లకు బడి తప్పనిసరి

### జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు

**నర్సాపూర్ రూరల్, జూన్ 11, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల పరిధి ఎల్లారెడ్డి గూడెం తండా పంచాయతీ పరిధిలోని జయరాం తండాలో పల్లె నిద్రలో భాగంగా రాత్రి బస చేశారు. ఉదయం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో ర్యాలి నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లి తండ్రులు తమ పిల్లల్ని పనికి కాకుండా బడికి పంపాలన్నారు. వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలన్నారు. కార్పొరేట్‌కు దీటుగా మౌళిక వసతుల కల్పన ప్రభుత్వ పాఠశాలలో ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. బడి బయట ఉన్న పిల్లల్ని బడిలో చేర్పించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

## గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు చేపడతాం

**పటాన్‌చెరు, జూన్ 11, ప్రభాతవార్త:** పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల పరిధిలోని అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రవేటు పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు మండలాల్లో ప్రభుత్వ గుర్తింపు, అనుమతులు లేకుండా ప్రవేటు పాఠశాలలను ప్రారంభించారని, అలాగే అడ్మిషన్ల తరగతుల ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. పాఠశాలలోనే పుస్తకాలు, టై,బెల్ట్,షూలు విక్రయిస్తున్నారని అలాంటి వాటిని తక్షణమె నిలిపివేయాలని తెలిపారు. ప్రభుత్వ నిభందనలకు విరుద్దంగా నడుచుకున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లితండ్రులు సైతం తమ పిల్లలను ప్రవేటు పాఠశాల్లో చేర్చేటప్పుడు ఆ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా,లేదా పూర్తి వివరాలను తెలుసుకోవాలన్నారు. తమకు ఎలాంటి సందేహం వచ్చినా తక్షణమే అధికారులను సంప్రదించాలని సూచించారు.

## ప్రసాద్‌రెడ్డిని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**దుబ్బాక(అక్బర్‌పేటభూంపల్లి), జూన్ 11, ప్రభాతవార్త:** చిట్టాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు సోలిపేట ప్రసాద్‌రెడ్డి ఇటీవలే రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న దుబ్బాక కాంగ్రెస్ నాయకులు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, పిఎసిఎస్ డైరెక్టర్ కాల్వ నరేష్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఉషయ్యగారి రాజిరెడ్డి, ఆకుల దేవేందర్‌లు కలసి మంగళవారం పరామర్శించారు. తొందరగా కొలుకుని అందరి మధ్యలోకి రావాలని కోరారు.

## పరిశుభ్రత తప్పనిసరి

**చిన్నశంకరంపేట, జూన్ 11, ప్రభాతవార్త:** గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని గజగట్లపల్లి గ్రామ ప్రత్యేక అధికారి లక్ష్మీ ప్రవిణ్ తెలిపారు. మంగళవారం ఆయన మండల పరిధి గజగట్లపల్లి గ్రామంలో పర్యటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న మురికి కాలువలో నీరు నిలిచి దుర్వాసన వస్తుందని గ్రామస్తులు ఆయన దృష్టికి తిసుకెళ్లారు. స్పందించి వెంటనే కాలువలు శుభ్రం చేయించారు.

## ఆర్థిక సహాయం అందజేత

**చిన్నశంకరంపేట, జూన్ 11, ప్రభాతవార్త:** పట్టణ కేంద్రానికి చెందిన దదువాయి పరమేశ్వర్ ఇటీవల మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ తారక శ్రీధర్, రాధిక దయాగ్నో సెంటర్ తూప్రాన్ వారి సహకారంతో మంగళవారం బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కాగా మృతుడు పరమేశ్వర్‌కు ముగ్గరు కూతుళ్లు ఉన్నారు. దాతలు ఎవరైన ముందుకు వచ్చి బాధిత కుటుంబానికి సహాయం అందించాలని వారు కోరారు.

## అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు మేలు

**మర్కుక్, జూన్ 11 (ప్రభాతవార్త):** తక్కువ ఖర్చు, అధిక దిగుబడి ఇచ్చే అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు రైతులకు ఎంతో మేలు అని ఏరువాక శాస్త్రవేత్తలు విజయ్, డాక్టర్ పల్లవిలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఇప్పలగూడెంలో అధిక సాంద్రత పత్తి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పత్తి విత్తనాన్ని న్యూమాటిక్ ప్లాంటర్ సహాయంతో అధిక సాంద్రత పద్ధతితో పత్తి విత్తనాలను విత్తుకోవాలని సూచించారు. ఈ పద్ధతిలో వేసుకోవడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణం విత్తుకోవచ్చని, మొలక శాతం కూడా పెరుగుతుందని, విత్తనం విత్తేటప్పుడు ఎరువులు కూగా వేసుకోవచ్చని తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి టి.నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పద్ధతిలోని వంగడాలు పంట కాలం తక్కువగా ఉండడం వల్ల కాయలు, పూత తొందరగా 20 నుండి 30 వరకు వస్తాయని అన్నారు. మొక్కలు ఏపుగా పెరగకుండా మేపిక్వాట్ క్లోరైడ్ అనే మందును పిచికారి చేసుకోవాలని పేర్కొన్నారు. ఎకరాకు 25 నుండి 30 కేజీల యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువులను వేసుకోవాలని సూచించారు. సాధారణంగా హైబ్రిడ్ వంగడాలను రైతులు ఎకరానికి 4938 మొక్కల నుండి 7407 మొక్కల సంఖ్య ఉండడం వల్ల మొక్కలు బాగా పెరగడం, పంటకాలం కూడా పెరగం జరుగుతుందని తద్వారా గులాబి రంగు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. కావున రైతులు అధిక సాంద్రత పద్ధతిలోనే పత్తి సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాశి కంపెనీ ప్రతినిధులు మనోజ్, ఏఈఓలు విష్ణువర్ధన్, రజినికాంత్, రైతు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలి

**గజ్వేల్, జూన్ 11 (ప్రభాతవార్త):** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మంగళవారం గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్ గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ శనిగిరి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు పెర్క పరశురాం, ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ, ఎంఎస్‌పి రాష్ట్ర నాయకుడు మైస రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 7న ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోతనసవం సందర్భంగా మందకృష్ణ మాదిగ నేతృత్వంలో జరిగే ఆత్మగౌరవ కవాతుకు లక్షలాది మంది తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ప్రతి గ్రామం నుండి వందలాది మంది విద్యార్థులను తరలించాలన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి జిల్లా నాయకత్వం గ్రామ గ్రామాన తిరిగి నూతన కమిటీలు ఏర్పాటుచేసి జెండా గద్దెలు నిర్మించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి శ్రీహరి సింధు, ఎమ్మార్పీఎస్ నాయకులు బొంది స్వామి, తప్పెట్ల రాములు, మినుముల కరుణాకర్, పోతగల్ల మహేష్ పాల్గొన్నారు.

# నార్సింగి అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నాం

### మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్



మాట్లాడుతున్న నాగపూర్ణ శ్రీనివాస్

**నార్సింగి, జూన్ 11 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపల్ అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నాము అని చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం చైర్ పర్సన్ అధ్యక్షతన నార్సింగి మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో నిర్మించబోయే సీసీ రోడ్లకు రూ.13.52 కోట్లు, డ్రైనేజి పనులకు రూ.8.45 కోట్లు, కమ్యూనిటీ హాల్‌కు రూ.22.12కోట్లు, వైకుంఠ ధామాలకు రూ.2.62కోట్లు, వీధి దీపాలకు రూ.2.55కోట్లు, గ్రీనరీ పనులకు రూ.కోటి, బోర్ సామాగ్రి, పారిశుద్య సిబ్బంది పనిముట్లు, ఇతర పనులకు గాను రూ.6.31.కోట్లు మొత్తం రూ.56.57కోట్ల పనులకు కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మాణం చేసింది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో కుల,మత,రాజకీయాలకు అతీతంగా పనులు చేస్తున్నామని తెలిపారు. ఏ వార్డులో ఏ సమస్య ఉన్నా కౌన్సిలర్ల దృష్టికి తీసుకు రావాలని, వెంటనే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు ఏ విశ్వాసం ఉంచి మమ్ములను ప్రజా ప్రతినిధులుగా ఎంపిక చేసుకున్నారో... ఆ విశ్వాసంను మరింత పెంచుకునేందుకు అహర్నిశలు కష్టపడుతున్నామని తెలిపారు. పాలక కమిటీ సభ్యులు, అధికారులందరి సహకారంతో నార్సింగిని వేగంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోపాల విజయ్‌బాబు, కమీషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి కొంత మంది అధికారులు దుమ్మా కొట్టారు.



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద

## విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ నేర్పించాలి

### ఎమ్మెల్యే వివేకానంద

**జీడిమెట్ల, జూన్ 11, ప్రభాతవార్త :** విద్యతో పాటు విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం శాసనసభ్యులు కేపీ వివేకానంద పాఠశాల యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం సుభాష్ నగర్ డివిజన్ వెంకటాద్రినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన భోది వృక్ష స్కూల్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాలమైన స్థలంలో అన్ని సదుపాయాలతో పాఠశాలను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య విశిష్ఠ అతిథిగా హాజరైన కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలతా సురేష్‌రెడ్డి, బీజేపీ పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి, రంగారావు, పొలె శ్రీకాంత్, టి.టి.కె. శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, తులసి, ఇస్మాయిల్, శేషు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సమాజాన్ని అధ్యయనం చేయాలి

**చిక్కడపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:** విద్యార్థులు, సమాజాన్ని అధ్యయనం చేయడంతో పాటు అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని వక్తలు పేర్కొన్నారు. చినుకు చినుకు పడుతూ ఉంటే, అబ్బనీ తీయనీ దెబ్బ పాటలు నాగేశ్వరరావు, విజయలక్ష్మిలు హుషారుగా పాడగా శ్రోతలు హర్షద్వానాలతో ప్రశంసలు అందించారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యాయి.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ పాత్రికేయులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో ఆధిపత్యవర్గాల భావజాలం, అదికార భావజాలంగా ఉందని, బలహీనవర్గాలు, పేదలు వారికి అందాల్సిన సౌకర్యాలు దేశంలో అందడం లేదన్నారు. ఒక వర్గంపై పనిగట్టుకుని మరి విషప్రచారం దేశంలో చేస్తున్నారన్నారు. ప్రశ్నించడం అనేది కీలకమని, ప్రశ్నలతోనే సమాజం ముందుకు వెడుతుందన్నారు. దేశంలో పాలిస్తున్న పాలకులు తమ భావజాలం వ్యాప్తి చేసేందుకు, విద్య, చరిత్ర అన్ని అంశాలను వాడుకుంటున్నారని, అందుకే సమసమాజం రావడానికి విద్యార్థులు తమ అకాడమిక్ చదువులతో పాటు సమాజంలో జరిగే దోపిడీ, అసమానతలు, ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ దేశంలో సమసమాజ స్థాపనకు పోరాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రానున్న కాలంలో బలమైన పోరాటాల నిర్వహణకు తరగతులలో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్, శ్రీకాంత్‌వర్మ, ప్రశాంత్, శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు మమత, డి.కిరణ్, అశోక్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ అసోసియేషన్ సమావేశం

**పేట్‌బషీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ శాఖ తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం సుచిత్ర, సాయి సంకల్ప నగర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పలు తీర్మాణాలు చేశారు. పెండింగ్‌లో ఉన్న 3 డిఆర్‌లు (కరువు బత్యం) తొందరగా విడుదల చేయాలి. వేతన స్థిరీకరణ కమిటీ నుండి రిపోర్ట్ తెప్పించుకుని పిఆర్‌సిని విడుదల చేయాలి. హెల్త్‌కార్డ్స్ అన్ని ఆస్పత్రుల్లో అన్ని చికిత్సలకు వర్తించేటట్లు చూడాలి. కమ్యునికేషన్ 15 సంవత్సరాల రికవరి నుండి 12 సంవత్సరాలకు కుదించాలి. రూ. 398 వేతనంతో పనిచేసిన వాళ్లందరికి మంజూరి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ట్రేటా నాయకులు సిహెచ్.బాలచందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్.మాణిక్యరెడ్డి, ప్రధాన కార్యదర్శి అంజయ్యగౌడ్, ఆర్థిక కార్యదర్శి దశరథరామశర్మ, ఉపాధ్యక్షులు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని అదృశ్యం

**తార్నాక, జూన్ 11 ప్రభాతవార్త :** కాలేజ్‌క్ ప్రాక్టికల్ కోసం వచ్చిన ఓ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్హెచ్‌ఓ. వహిద్ కథనం ప్రకారం..ఈ నెల 10న వారాసిగూడ ఉప్పర్ బస్తీకి చెందిన సి.వైష్ణవి(23) ఓ.యూలోని దూర విధ్యాకేంద్రం కాలేజ్‌లో ప్రాక్టికల్ కోసం తన సోధరుడు కళాశాల వద్ద డ్రాప్ చేసి వెళ్లాడు. తిరిగి సాయంత్రం కాలేజ్‌కి వచ్చిన ఆమె సోధరుడికి వైష్ణవి కాలేజ్‌లో కనిపించలేదు. దీంతో ఆమెకు ఫోన్ చేయడంతో స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఆమె ఆచూకి కోసం వెతికినా కనిపించలేదు. ఆందోళనకు గురైన ఆమె తండ్రి రాజు పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## భక్తిరసంతో ఓలలాడించిన అన్నమాచార్య సంకీర్తనలు

**రవీంద్రభారతి, జూన్ 11 ప్రభాతవార్త :**
శ్రీ తాళ్లపాక అన్నమాచార్య 616వ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో సరసిజ థియేటర్, లేకిని రచయిత్రుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ గాయనీమణులు హేమాముక్తేశ్వరరావు, రాధిక, శివశ్రీ, శ్రీవాణి, పి.వి.ఎస్.కృష్ణకుమారి, ఇంద్రగంటి పద్మలత, మారెళ్ళ సావిత్రిలు పూర్ణచంద్రరావు కీబోర్డు, దామోదర్ తబలతో వాద్యసహకారం అందించగా వీనులవిందుగా ఆలపించిన అన్నమాచార్య సంకీర్తల ఆహుతులను భక్తిరసంతో ఓలలాడించాయి. అత్తలూరి విజయలక్ష్మి సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు డా. ఎం.కె.రాము, కలగా కృష్ణమోహన్, పి.ప్రసాద్, శోభా, తురగా జయశ్యామల తదితరులు ప్రముఖ పద్మ వీణానాద విభూషిణి ఈమని కళ్యాణిని ఘనంగా సత్కరించి మోచెర్ల రాజ్యలక్ష్మి విపంచి విద్వన్మణి పురస్కారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాయిమాధురి, వి.ధనలక్ష్మి, అల్లూరి గౌరీలక్ష్మి, నండూరి సుందరీ నాగమణి, సరస్వతి, షామీర్ జానకి, సర్వమంగళగౌరి, వీణా తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ ట్రీట్‌మెంట్ కోసం

## ప్రభుత్వం నుంచి రూ.లక్ష మంజూరు

**హైదరాబాద్, జూన్ 11 ప్రభాతవార్త:** అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన మోహిదీ అహ్మద్ ఆలీకి రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఓసీ కింద మంజూరు చేసిన రూ.లక్ష చెక్కును మంగళవారం లబ్దిదారులకు స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అందించారు. నిమ్స్ ఆసుపత్రిలో మెడికల్ ట్రీట్‌మెంట్‌కు సంబంధించిన చికిత్సకు అవసరమైన ఖర్చులకు సంబంధించి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చేసి న విజ్ఞప్తి మేరకు ఈ మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందని తెలుపుతూ జారీ చేసి న లేఖను బాధితులకు అందించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చార్మినార్,జూన్ 11 ప్రభాతవార్త :** విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 12వ తేదీ బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు వరకు జూ పార్కు ప్రధాన రహదారి,రంనాస్‌పుర,ప్రిన్స్ కాలనీ,బహదూర్‌పుర,రామా టాకీస్,కామాటిపుర,ఉస్మాన్ బాగ్ ప్రాంతాలలో 10.30 నుంచి 11.30 గంటలు వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు చార్మినార్ సిబిడి అధికారులు వెల్లడించారు.

## ఎర్రగుంటలో అక్రమ నిర్మాణాలను తొలగింపు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

**తార్నాక, జూన్ 11 ప్రభాతవార్త :** తార్నాక ఎర్రగుంట చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో కొందరు వ్యక్తులు నిర్మాణాలను చేయడంతో విషయం తెలుసుకున్న మారెడ్‌పల్లి మండల అధికారులు మంగళవారం అక్రమనిర్మాణాలను తొలగించారు. సర్వే నెం.121, 124లో ఉన్న ఎఫ్‌టిఎల్ భూముల విషయంలో కోర్టులో కేసు నడుస్తోంది. దీనిని ఏమి లెక్క చేయకుండా అక్రమార్కులు రాత్రి సమయాల్లో నిర్మాణం చేయడంతో స్థానికుల ఫిర్యాదుతో నిర్మాణాలను కూల్చివేశారు.

## మంత్రముగ్దులను చేసిన సినీ సంగీత విభావరి

**చిక్కడపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:** గానగంధర్వ ఎస్‌పి.బాలసుబ్రహ్మణ్యం, సహగాయణీమణులతో కలిసి వివిధ చలనచిత్రాలలో నుంచి పాడిన పాటలు సంగీతప్రియులను మంత్రముగ్దులను చేశాయి. మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో శ్రీద్యుతి మ్యూజికల్ అకాడమి నిర్వాహకులు గాయనీగాయకులు పేరి నాగేశ్వరరావు, పేరి విజయలక్ష్మి, ఇషాన్ ఫౌండేషన్, విజయ్ క్రియేషన్స్ సాంస్కృతిక సేవా సంస్థ నిర్వమణలో యుకో బ్యాంక్ సౌజన్యంతో విఖ్యాత గాయకుడు పద్మవిభూషణ్, డాక్టర్ ఎస్‌పి.బాలసుబ్రహ్మణ్యం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వీనులవిందు చేసే పాటలను జంటనగరాలకు చెందిన గాయనీ గాయకులు పాడి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. గాయనీ గాయకులు అరుగంటలకుపైగా పాటలు పాడి బాలు పట్ల వారికున్న అభిమానం చాటారు. శ్రీధర్ సహగాయనీ సౌమ్యతో కలిసి పాడిన స్వాతిముత్యం చిత్రంలోని 'సువ్వీసువ్వీ సువ్వాలమ్మా' పాటను రసభరితంగా ఆలపించారు. రమణమూర్తి, సుదర్శన్, శ్రీధర్, కళ్యాణీ, ప్రసన్న, కృష్ణవేణిలు పాడినపాటలు ఆకట్టుకున్నాయి. సభా కార్యక్రమంలో కళాపోషకులు నాగప్రసాద్ మాట్లాడుతూ సమాజిక సేవా కార్యకర్త పేరి నాగేశ్వరరావు, పేరి విజయలక్ష్మిలు స్వయంగా గాయకులే కాకుండా సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఆదర్శంగా నిలిచారని అభినందించారు.

## సెమీస్‌కు చేరిన ప్రింట్ మీడియా టీం

### -పోరాడి ఓడిన శాట్స్ జట్టు



ప్రింట్‌మీడియా - స్పోర్ట్ అథారిటీ ఆఫ్ తెలంగాణ జట్లు

**హైదరాబాద్,జూన్ 11,ప్రభాతవార్త:**
వీడ్రీమ్స్ బిజ్‌టెక్ కార్పొరేట్ ఛాంపియన్‌షిప్‌లో ప్రింట్‌మీడియా సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం శివరాంపల్లిలోని విజయానంద్ గ్రౌండ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ప్రింట్‌మీడియా టీమ్ 39పరుగులతేడాతో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్)పై ఘన విజయం సాధించింది. తొలుత టాస్‌గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రింట్ మీడియా జట్టు నిర్ణీత 20ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. రవికుమార్ (36), రోనిత్‌సింగ్ (36) మెరుగ్గా రాణించారు. ఫణి కిశోర్ (3/27) మూడువికెట్లతో ఆకట్టుకున్నాడు. ఆతర్వాత లక్ష్యచేధనకు దిగిన శాట్స్ టీం 7వికెట్లు కోల్పోయి 147 పరుగులకే పరిమితమైంది. ఓపెన్ కుమార్ బాబు (54) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. మూడు వికెట్లతో జట్టు విజయంతో కీలకంగా వ్యవహరించిన ప్రింట్‌మీడియా ప్లేయర్ రాజశేఖర్(3/18)కు "మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్"దక్కింది. బుధవారం జరిగే సెమీస్‌లో డాక్టర్స్-11 జట్టుతో ప్రింట్‌మీడియా తలపడనుంది. ఈకార్యక్రమంలో శాట్స్ కోచ్‌లు రవి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్తను ఆటోలో వేసే విధంగా చూడాలి : డిసి

**అత్తాపూర్ జూన్11,ప్రభాతవార్త :**
బక్రీద్ పండుగ సందర్భంగా చెత్తచెదారం లేకుండా పరిసరాల శుభ్రంగా ఉంచుకోవాలని రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి డిప్యూటి కమిషనర్ రవి కుమార్ పేర్కొన్నారు.మంగళవారం రాజేంద్రనగర్‌లోని జిహెచ్ఎంసి కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఏ,ఎస్‌ఎస్,డై ఎస్‌డబ్ల్యుఎంలతో డిప్యూటి కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డిసి రవి కుమార్ మాట్లాడుతూ.... బక్రీద్ పండుగ సందర్భంగా చెత్త ఎక్కడ కూడా వేయకుండా చెత్త ఆటోలోనే వేసే విధంగా ఆటోల ద్వారా ముందస్తు ప్రకటనలు చేయాలని అన్నారు. చెత్త తొలగింపు,నల్ల కవర్ల సేకరణపై దృష్టి సారించాలన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## చెత్తకుప్పలో ఆడ శిశువు పిండం లభ్యం

**ఎల్.బి.నగర్, జూన్ 11 ప్రభాతవార్త:**
గుర్తుతెలియని ఆడ శిశువు పిండం లభ్యమయ్యింది. ఈ సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తట్టిఆన్నారం లోని ఆదివాసి కాలనీలోని ఒక పాత ఇంటి పక్కన చెత్త ఉన్న ప్రదేశంలో ఒక పిండము (నెలలు నిండని ఆడ శిశువు)ను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు చూశారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన నెలలు నిండని ఆడ శిశువు పిండాన్ని పరిశీలించారు. కాలనీ అధ్యక్షు డు రమావత్ మట్టయ్య ఇచ్చిన ఫిర్యాదు పోలీసు కేసునమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వసుంధర

## 'గానకళాప్రపూర్ణ' శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల శతజయంతి

**చిక్కడపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:** శ్రీకళామంజరి, నవ్యనాటక సమితి సంయుక్త ఆధ్వర్యంలో 'సంగీతసాహిత్య కళానిధి', 'గానకళాప్రపూర్ణ' శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల శతజయంతి కార్యక్రమాన్ని 15న నిర్వహించబోతున్నట్లు నిర్వాహక సంస్థల ప్రతినిధులు బండారి రమేష్, డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, ఎం.లక్ష్మీమానసలు తెలిపారు. మంగళవారం చిక్కడపల్లిలో నవ్యసామితీసమితి కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను తెలంగాణ రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకులు జి.వసుంధర హాజరై ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ ఆవిష్కరణలో సమన్వయకర్త నిష్టల సుధామాల, డాక్టర్ ఇందిరాహేమ, వేమరాజు విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ప్రభుత్వ పూర్వ సలహాదారులు, విశ్రాంత సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి హాజరవుతారని, కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావు, డాక్టర్ రేవూరి అనంతపద్మనాభరావు, జి.వసుంధర తదితరులు పాల్గొంటారన్నారు. ఆనాటి సంగీత, సాహిత్యసమర్పణలో భాగంగా యర్రంశెట్టి ఉమామహేశ్వరరావుచే 'అష్టావధానం', ఆముదాల మురళీచే సాహితీ ప్రసంగం, కృష్ణమాచార్యుల శిష్యప్రశిష్యులచే సంగీత సమర్పణ, ఎన్‌సి.కౌశిక్ కళ్యాణ్‌చే సంగీత నీరాజనం ఉంటుందని లక్ష్మీమానస వివరించారు.

## 13వ శతాబ్దానికి చెందిన తెలుగు కవి గోన బుద్దారెడ్డి

### -త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి



గోన బుద్దారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జనార్దనమూర్తి

**చిక్కడపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:** పదమూడవవ శతాబ్దానికి చెందిన తెలుగు కవి గోన బుద్దారెడ్డి అని త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అన్నారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో తెలుగు కవి గోన బుద్దారెడ్డి యాదిలో కార్యక్రమంలో జరిగిన సంస్మరణ సభకు ముఖ్యఅతిథిగా కళావిఎస్.జనార్దనమూర్తి హాజరై గోనబుద్దారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ప్రసంగించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, సహస్రకంఠరవ, సాహితీవేత్త చిక్కారామరాజు, సంఘసేవకులు వంగాల బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళావిఎస్.జనార్దనమూర్తి మాట్లాడుతూ గోనబుద్దారెడ్డి రచించిన రంగనాథ రామాయణమే తెలుగులో తొలి సంపూర్ణ రామాయణ కావ్యంగా తెలుగు నాట ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు. అంతకుముందు తిక్కన రచించిన నిర్వచనోత్తర రామాయణమే కాని సంపూర్ణ రామాయణం కానేకాదన్నారు. 13 శతాబ్దానికి చెందిన గోన బుద్దారెడ్డి కాకతీయుల సామంతరాజుగా పనిచేశారని అన్నారు. ఆంగ్ల విద్య తెలుగు నాట ప్రవేశించని రోజుల్లో సంస్కృత భాషా పాఠకులు తప్ప మిగిలిన విద్యార్థులందరికీ చిన్నతనంలోనే పెద్ద పుస్తకం పట్టించి చదివించేవారని, ఇంతకి పెద్దపుస్తకం అంటే మూడు పుస్తకాలకు సామాన్యనామం అని, ఆ మూడు పుస్తకాలు కవిత్రయం వారి ఆంధ్రమహాభారం, గోన బుద్దారెడ్డి కృతమైన రంగనాథ రామయణం, పోతన భాగవతం అని అన్నారు.

### ఆరెకటికలకు రూ.500కోట్లతో

## ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

**చిక్కడపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:** ఆరెకటికలకు రూ.500కోట్లతో రాష్ట్రంలో వెంటనే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆరెకటిక అభివృద్ధి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.భూంపల్లి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆరెకటిక అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశంలో అశోక్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి ప్రసంగించారు. ఈ వర్గాలకు ప్రభుత్వం వైన్స్ టెండర్లలో 30శాతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని, బీసీ-డి నుంచి బిసి-ఎ హోదా కల్పిస్తూ జీవో జారీ చేయాలని, మటన్ షాపులకు ఉచితంగా విద్యుత్తును సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఆరెకటిక మహిళలకు రూ.3లక్షల బ్యాంక్ రుణం 90శాతం సబ్సిడీతో మటన్ క్యాంటీన్‌లు, చొక్కాబోటి కర్రీపాయింట్లను వెంటనే ఏర్పాటు చేయాలని, 90శాతం సబ్సిడీతో గొర్ల పంపిణీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేసినా, వినతిపత్రాలు ఇచ్చినా ఆరె కటికలకు న్యాయం జరగడం లేదని, ఏ ఒక్కటి పరిష్కారం నేటికి జరగలేదని, రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి కె.నందకిషోర్, గౌరవ అధ్యక్షుడు బి.కాజారామ్, యువత అధ్యక్షుడు కె.నవీన్, గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు స్వరస్వతి భాయి, కార్యనిర్వాహక కార్యద్శి మురహరికార్ పవన్‌కుమార్, కోశాధికారి కెడి.దినేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు కోయల్‌కార్ జహంగీర్, ఫిలిం డైరెక్టర్ జిజె.రాజు, రాకేశ్ మట్కీకార్, మిడ్జిల్ మండల అధ్యక్షుడు కె.నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల విక్రేతలు ముగ్గురు అరెస్ట్

**చార్మినార్, జూన్ 11 ప్రభాతవార్త :**
హైదరాబాద్ పాతబస్తీలో గుట్టు చప్పుడు కాకుండ మాదక ద్రవ్యాలు (డ్రగ్స్) విక్రయించటానికి ప్రయత్నించిన ముగ్గురిని యాంటి నార్కొటిక్ బ్యూరో అదుపు లోకీ తీసుకుంది. నిందితుల నుంచి 34 గ్రాముల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌రఘునాథ్ కథనం ప్రకారం.....బెంగుళూరుకు చెందిన జునైద్, పాతబస్తీ చందూలాల్ బారాదరికి చెందిన రెహ్మత్, అంబర్ పేట్‌కు చెందిన అబ్రార్,ఫైజల్‌లు కలిసి ముఠాగా ఏర్పడ్డారు. అంబర్‌పేట్‌కు చెందిన ఫైజల్ బెంగుళూరు నుంచి డ్రగ్స్‌ను తీసుకు వస్తున్నాడు.అవసరం ఉన్న వారికి ఈ ముగ్గురు కలిసి మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్నారు. కాగా ఈ నెల 10వ తేదీన జునైద్,రెహ్మత్,అబ్రార్,ఫైజల్‌లు కలిసి హైదరా బాద్ పాతబస్తీ హాసన్‌నగర్ వద్ద డ్రగ్స్‌ను విక్రయించటానికి ప్రయత్నిస్తున్న సమయంలో యాంటి నార్కొటిక్ బ్యూరో అదుపులోకీ తీసుకుంది. వారి వద్ద నుంచి రెండు లక్షల రూపాయలు విలువ చేసే 34 గ్రాముల మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం బహదూర్‌పుర పోలీసులకు అప్పగించారు.ముగ్గురు నింధితులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ రఘునాద్ తెలిపారు.ఈ కేసును బహదూర్‌పుర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పేదబ్రాహ్మణులను ఆర్థికంగా ఆదుకోవాలి

**-ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావుకు బ్రాహ్మణ సేవా సమితి వినతి**



వేణుగోపాల్‌రావుతో రమణారావు, మంత్రి సునీల్, రామారావు తదితరులు

**హైదరాబాద్, జూన్ 11,ప్రభాతవార్త:**
దారిద్రరేఖ దిగువనున్న బ్రాహ్మణులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించి ఆర్థికంగా ఆదుకోవాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు ,ప్రభుత్వ సలహాదారు హర్కర్ వేణుగోపాల్‌రావును కోరారు. ఈమేరకు మంగళవారం వేణుగోపాల్‌రావు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా రమణారావు మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోని బ్రాహ్మణులు నేటికి కడుపేదరికంలో ఉన్నారని, పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఫీజుల్లో రాయితీలు ఇచ్చి, ఉపకార వేతనాలు అందించాలని కోరారు. అన్నిరంగాల్లో బ్రాహ్మణులు పూర్వ వైభవం కోసం బ్రాహ్మణ ప్రజాప్రతినిధులు, మేధావులు తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సమితి ప్రచార కార్యదర్శి మంత్రి సునీల్, రాష్ట్ర ప్రతినిధి కరకపట్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

### మాలలకు నామినేటెడ్ పదవులలో అవకాశం ఇవ్వాలి

**ముషీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** నామినేటెడ్ పదవులలో ఎస్సీ మాల అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని తెలంగాణ మాల వారియర్స్ టీం వ్యవస్థాపక అధ్యక్షులు జంగా శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం జ్యోతిబాయ్ పూలే ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను తెలంగాణ మాల వారియర్స్ టీం నాయకులు కలసి, బొకేతో సత్కరించి, ఇటీవల లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ ఎనిమిది స్థానాలలో విజయం సాధించినందుకు అభినందనలు తెలిపారు.

## బాధితులకు న్యాయం చేయాలి

**-రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య**



బాధితులకు కలిసి మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జూన్ 11,ప్రభాతవార్త:**
అదికవడ్డీ ఆశచూపి నిరుపేదలనుంచి కోట్లు వసూలు చేసి చివరికి చేతులేత్తేసిన ఫైనాన్స్ కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం తోపాటు బాధితులకు న్యాయం చేయాలని బిసిసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులతో కలిసి మాట్లాడారు. ఈసందర్భంగా బాధితులు మాట్లాడూతూ సాయిరాం ఫైనాన్స్ పేరుతో నాగర్‌కర్నూల్ పట్టణంలో ఏర్పాటు చేసి, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో దాదాపు 20 గ్రామాల్లో తమ ఫైనాన్స్‌లో పెట్టుబడి పెడితే రూ.2వడ్డీ చెల్లిస్తామని చెప్పి దాదాపు 150కోట్లవరకు వసూలు చేశారన్నారు. కొద్దిరోజులకు తమడబ్బులు తిరిగివ్వాలని అడగగా దాటవేస్తూ వచ్చారని చివరకు 2021 సంవత్సరంలో కంపెనీ మూసివేశాన్నారు. దీంతో నిర్వాహకులపై 8-ఫిబ్రవరి 2023లో నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినప్పటికి ఆకంపెనీలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తమకు న్యాయం చేయాలని స్టేషన్‌కు వెళ్తే తమనే బెదిరిస్తున్నారని ఎలాగైనా తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### ఆల్విన్ కాలనీ డివిజన్ అభివృద్ధికి సహకరించాలి : కార్పొరేటర్

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 11, ప్రభాతవార్త**
శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్ అభివృద్ధి విషయమై జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్ పరిధిలో వాంబే కాలనీలో ఉన్న మట్టి కుప్పలు తొలగించి, కాలనీకి అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని వినతిపత్రాన్ని అందించారు. సానుకూలంగా స్పందించిన మేయర్ అతిత్వరలో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శివరాజ్‌గౌడ్, పాండుగౌడ్, పోశెట్టిగౌడ్, సంతోష్, బిరాదర్ పాల్గొన్నారు.

### అసదుద్దీన్ ఓవైసీని కలిసిన ఎంఐఎం నేత మహమ్మద్ యూసుఫ్‌ఖాన్

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 11, ప్రభాతవార్త**
హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులుగా 5వ సారి భారీ మెజార్టీతో విజయం సాధించిన ఆలిండియా ఎంఐఎం అధ్యక్షులు పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీని కూకట్‌పల్లికి చెందిన ఎంఐఎం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్ డివిజన్ ఎంఐఎం అధ్యక్షులు ఎండి యూసుఫ్‌ఖాన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు అసదుద్దీన్ ఓవైసీకి పూలబొకె అందజేసి అభినందనలు తెలిపారు.

### కేంద్రమంత్రులను కలిసిన బిజెపి నాయకులు

**బేగంపేట జూన్ 11,ప్రభాతవార్త**
కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఎన్నికైన గంగాపురం కిషన్ రెడ్డి,కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ లను బీజేపీ సీనియర్ నాయకులు చీరె సత్యనారాయణ (శ్రీకాంత్) ఢిల్లీలో కల్సి అభినందనలు తెలియజేసారు.ఈ సందర్బంగా చీరె సత్యనారాయణ (శ్రీకాంత్) మాట్లాడుతూ మోదీ మంత్రి వర్గంలో కిషన్ రెడ్డి,బండి సంజయ్‌లు చోటు సాధించడం తెలంగాణా రాష్ట్ర ప్రజలందరికి గుర్తింపు దక్కినట్లుగా భావిస్తున్నామని,కేంద్రం సహకారంతో రాష్ట్రంలో అభివృద్దికి వారి వంతు సహాయ సహకారాలు అందిస్తారన్న ఆశాభావాన్ని చీరె వ్యక్తం చేసారు.

### మయూరి మార్గ్ లో రేషన్ షాపును పున : ప్రారంభించాలి

**బేగంపేట జూన్ 11,ప్రభాతవార్త :** బేగంపేట మయూరి మార్గ్ లో గత నాలుగు నెలల క్రితం మూసివేసిన రేషన్ దుకాణం 899ను పున;ప్రారంభించేలా చూడాలంటూ మంగళవారం నగర కాంగ్రెస్ నాయకులు గౌరపల్లి రమేష్ ఆధ్వర్యంలో మయూరి మార్గ్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు హైదరాబాద్ జిల్లా చీఫ్ రేషనింగ్ అధికారి జి.ఫణీంద్రారెడ్డి,డీఎస్ఓ రమేష్‌లకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేసారు.గత నాలుగు నెలల క్రితం మయూరి మార్గ్‌లో ఉన్న రేషన్ దుకాణం 899ను సీజ్ చేసారని,అప్పటి నుంచి తాము రోడ్డు దాటి శ్యాంలాల్ బిల్డింగ్,బ్రాహ్మణవాడీ, భగవంతాపూర్,ప్రకాష్‌నగర్ ,పాటిగడ్డలకు వెళ్లాల్సి వస్తుందని,ఇది చాలా ఇబ్బందిగా ఉందని,వెంటనే మయూరి మార్గ్‌లోని షాపును తెరిపించి అక్కడే సరుకులు అందించాలని వారు సీఆర్ఓ,ఏఎస్ఓలకు విజ్ఞప్తి చేసారు.దీంతో స్పందించిన వారు రెండు మూడు రోజుల్లో మయూరి మార్గ్‌లో షాపు ను తెరిచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గౌరపల్లి రమేష్ తెలిపారు.

### బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే నిధులు మంజూరైయ్యాయి : నివేదిత

**కంటోన్మెంట్,జూన్ 11 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం 5వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి నివారణకు బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే పవర్ బోర్‌వెల్స్ వేసేందుకు నిధులు మంజూరైయ్యాయని ఎన్నికల కోడ్ వల్ల బోర్‌వెల్ పనులు నిలిచిపోయాయని బిఆర్ఎస్ నాయకురాలు నివేదిత తెలిపారు. మంగళవారం ఆమె 5వ వార్డులోని బాలాజీ కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న నిధులతోనే నూతన నబోర్‌వెల్స్‌కు నిధులు మంజూరు కాగా నూతన ఎమ్మెల్యే శ్రీగణేష్ పనులు ప్రారంభించడం సరైంది కాదన్నారు.

# ముగిసిన తలసాని శంకర్ యాదవ్ అంత్యక్రియలు

**-అంతిమ యాత్రలో పాల్గొన్న కెటిఆర్, పద్మారావు, మహమూద్ అలీ**

**కంటోన్మెంట్,జూన్ 11 ప్రభాతవార్త:**
మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండామార్కెట్, బోయిన్‌మార్కెట్ వెజిటేబుల్ కమీషన్ ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ అంత్యక్రియలు మంగళవారం వేలాది మంది సమక్షంలో జరిగాయి. గత కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న తలసాని శంకర్ యాదవ్ ఈనెల 10న సికింద్రాబాద్ యశోధ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మంగళవారం తలసాని కుటుంబ సభ్యులు బన్సీలాల్‌పేట్‌లోని హిందూ స్మశాన వాటిక గ్రేవ్ యార్డులో అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ మంత్రి తలఎసాని శ్రీనివాస్ యాదవ్ అంత్యక్రియలు పూర్తైయ్యే వరకు పర్యవేక్షించారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని రాధికా కాలనీలో నివాసం ఉంటున్న శంకర్ యాదవ్ ఇంటి నుంచి ప్రారంభమైన అంతిమ యాత్రలో కుటుంబ సభ్యులు, బంధువులు,ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు వేలాది సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. తలసాని అంతిమయాత్ర మారేడ్‌పల్లి రాధికా కాలనీ నుంచి వైఎంసిఏ క్లాక్‌టవర్, మోండా మార్కెట్, బండి మెట్టు, సిటీలైట్ హోటల్, జబ్బార్ కాంప్లెక్స్‌మీదుగా బన్సీలాల్‌పేట్ గ్రేవ్ యార్డుకు చేరుకున్న అనంతరం హిందూ సాంప్రదాయ పద్ధతిలో తలసాని శంకర్ యాదవ్ అంత్యక్రియలు నిర్వహించారు. బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రధాన కూడలీల వద్ద శంకర్ యాదవ్ చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. శంకరన్న మరణించాడని వార్తను నమ్మలేక పోతున్నామని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎదుట ప్రజలు కన్నీటి పర్యంతమైనారు.



మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు శంకర్ యాదవ్ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పద్మారావు గౌడ్, జగదీశ్వర్ రెడ్డి తదితరులు

**అంతిమ యాత్రాలో పాల్గొన్న కేటీఆర్ . . .. ..**
తలసాని శంకర్ యాదవ్ అంతిమ యాత్రలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) బన్సీలాల్‌పేట్‌లోని గ్రేవ్ యార్డు వరకు నిర్వహించిన అంతిమ యాత్రలో పాల్గొని శంకర్ యాదవ్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఈ యాత్రలో, మాజీ మంత్రులు పద్మారావు గౌడ్, మల్లారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, మహమూద్ అలీ, రాజ్య సభ సభ్యులు అనీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, కార్పోరేషన్ మాజీ చైర్మన్లు డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, బోయిన్‌పల్లి మార్కెట్ తొలి చైర్మన్ ముప్పిడి గోపాల్, సికింద్రాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వి.హన్మంత్ రావ్, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రామ్‌దాస్ అథవాలేకు మంత్రి పదవి రావడం హర్షణీయం

**-ఏఆర్‌మల్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు మల్లు శివరాం**



రామ్‌దాస్ అథవాలేను సన్మానిస్తున్న మల్లుశివరాం తదితరులు

**హైదరాబాద్, జూన్ 11,ప్రభాతవార్త:**
ప్రధాని నరేంద్రమోదీ మంత్రివర్గంలో మూడుదశాబ్దాలుగా బడుగు,బహీనవర్గాల సామాజిక న్యాయం, సాధికారత కోసం పోరాడుతున్న రామ్‌దాస్ అథవాలేకు మరోసారి మంత్రిగా అవకావం కల్పించడం సంతోషించదగ్గ విషయమని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఏఆర్‌మల్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు మల్లు శివరాం అన్నారు. మంగళవారం కేంద్రమంత్రి రామ్ దాస్‌ను ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు. ఈసందర్బంగా శివరాం మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి సామాజిక న్యాయం, సాధికారత లభించినప్పుడే అంబేడ్కర్ ఆశయాలు నెరవేరినట్లని ఎన్నోమార్లు రామ్‌దాస్ అథవాలే చెప్పేవారని ఆయన అన్నారు. తనతండ్రి స్వర్గీయ మల్లు అనంతర రాములు కూడా కాంగ్రెస్ పార్టీకి కొన్ని దశాబ్దాల పాటు సేవలు అందించారన్నారు. ఆయన మాజీ ప్రధాని ఇందిరాగాంధీతో ఎంతో నమ్మకంగా మెలిగారని తాము ఎ.ఎర్.మల్లు ఫౌండేషన్ ద్వారా అనేక సేవాకార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.

### పేద యువతలకు వివాహ చెక్కులు అందజేత

**సైఫాబాద్, జూన్ 11 ప్రభాతవార్త :** ముత్తూట్ ఫైనాన్స్ యాజమాన్యం పేదలకు ఆర్థికంగా చేయూతనివ్వడం గొప్ప విషయమని తెలంగాణ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామమూర్తి అన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని లిబర్టీ సర్కిల్‌లోగల ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయంలో ముత్తూట్ వివాహ సన్మానం-2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 9 మంది పేద మహిళలకు వివాహ చెక్కులను, 13 మంది బిటెక్, ఎంబిబిఎస్ విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అతిథుల సమక్షంలో జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన సభావేదికకు తెలంగాణ, ఎపి జోనల్ మేనేజర్ జితేంద్ర కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామమూర్తి అర్హులకు చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఫైనాన్స్ వ్యాపారంలో దేశంలోనే దిగ్గజ సంస్థగా కొనసాగుతున్న ముత్తూట్ ఫైనాన్స్ సామాజిక బాధ్యతను తన భుజాలకు ఎత్తుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యర్రమంలో సిఎస్ఆర్ మేనేజర్ లక్ష్మీనారాయణ, రీజనల్ హెడ్స్ కె.వి.మురళి, సంపత్ కుమార్, విబిన్‌మీనన్, అబ్రహం జాన్, జిజో అబ్రహం, శ్రీనివాస్, సురక్ష సేవా సమితి అధ్యక్షుడు గోపిశంకర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అల్లూరి ప్రసన్నకుమార్, బిందు, ప్రవీణ్, మురళీ, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి : శ్రీగణేష్

**కంటోన్మెంట్,జూన్ 11 ప్రభాతవార్త:**
కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధిపర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మంగళవారం 5వ వార్డులోని బాలాజీ నగర్‌లో రూ.5 లక్షల వ్యయంతో ప్రభుత్వ నిధులతో మంజూరైన పవర్‌బోర్ వెల్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్బంగా శ్రీగణేష్ మాట్లాడుతూ కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి మొదటి కార్యక్రమం పవర్‌బోర్‌వెల్ పనులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కంటోన్మెంట్ ప్రజలకు మంచి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎసామాజిక కార్యకర్త తెలుకుంట సతీష్ గుప్త, కాంగ్రెస్ నాయకులు రేపాల వెంకటేశ్వర్లు, గజ్వెల్ భరత్,గుజ నాగేందర్ యాదవ్, సంజీవ్‌రావ్, బిఆర్ఎస్ నాయకులు కిరణ్, రావుల సతీష్, బస్తీ నాయకులు దుర్గయ్య పాల్గొన్నారు.

### కంటోన్మెంట్ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి : శ్రీగణేష్



రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో బేటీ అయిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,జూన్ 11 ప్రభాతవార్త:**
కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఎన్.శ్రీగణేష్ గెలిచిన తరువాత మొట్ట మొదటి సారిగా మంగళవారం తెలంగాణ సచివాలయానికి వెళ్లి రవాణా శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన కంటోన్మెంట్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి కావాల్సిన నిధుల విడుదలపై మంత్రితో చర్చించారు. ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు ముప్పిడి మధుకర్, తేజ్‌పాల్, సదానంద్ గౌడ్, శేఖర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## జలపాతంలో పడి హైదరాబాద్ వాసి మృతి

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** విహార యాత్రలో జలపాతం వద్ద సెల్ఫీ ఫొటో తీసుకుంటూ ప్రమాదవశాత్తు జారి పడి హైదరాబాద్ వాసి మృతి చెందాడు. కర్ణాటక చిక్‌మగళూరులో జరిగిన ఈ దుర్ఘటన మృతుడి కుటుంబంలో విషాదాన్ని మిగిల్చింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్‌కు చెందిన శ్రావణ్(25) ప్రముఖ ఈ కామర్స్ సంస్థలో సిస్టమ్ అనెలిస్ట్‌గా పని చేస్తున్నాడు. ఇటీవలె తన స్నేహితుడితో చిక్‌మగళూరుకి విహారయాత్రకు వెళ్ళాడు. స్థానికంగా బైక్‌ను అద్దెకు తీసుకున్న ఇద్దరు స్నేహితులూ అక్కడి పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. ఈ క్రమంలో సోమవారం కమ్మెనగుండిలోని హెబ్బె జలపాతం వద్దకు చేరుకున్న వీరు ఈత రానప్పటికీ నీటిలోకి దిగి సెల్ఫీఫొటోలు తీసుకున్నారు. గత కొద్ది రోజులుగా ఆ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో జలపాతం వద్ద నీటి ప్రవాహం బలంగా ఉంది. దాంతో సెల్ఫీ తీసుకుంటున్న శ్రావణ్ నీటి ప్రవాహానికి పట్టుదప్పి కింద పడి కొట్టుకుపోగా, ఒక బండరాయి తలకు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అది గమనించిన స్థానికులు స్నేహితులిద్దరినీ రక్షించి సరస్సులోంచి బయటకు తీశారు. చికిత్స నిమిత్తం శ్రావణ్‌ని సమీప ఆసుపత్రికి తరలించగా అతడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు చిక్‌మగళూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### మంగళ్‌హాట్ కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** మంగళ్‌హాట్ పరిధిలోని ముగ్గురు కానిస్టేబుళ్ళు సస్పెండయినట్లు పోలీసు శాఖ వెల్లడించింది. ఈ మేరకు మంగళవానం అధికారిక ఉత్తరువులు జారీ చేశారు. నగర పోలీస్ కమీషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు వారిపై చర్యలు తీసుకున్నారు. ఇటీవలె గ్యాంబ్లింగ్ నిర్వహకులు, గంజాయి స్మగ్లర్లు, రౌడీ షీటర్లు, బెల్ట్ షాపు ఓనర్లతో సాన్నిహిత్యంగా ఉంటూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ మహేందర్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. కాగా, ఈ కేసుతో మంగళ్ హాట్ స్టేషన్‌లోని ముగ్గురు కానిస్టేబుళ్ళతో సంబంధముందని తేలడంతో వారిని కూడా సస్పెండ్ చేశారు.

### డ్రంక్ అండ్ డ్రైవింగ్ కేసులో పట్టుబడ్డ మైనర్లు

**కంటోన్మెంట్,జూన్ 11 ప్రభాతవార్త:** డ్రంక్ అండ్ డ్రైవింగ్ కేసులో 11 మంది మైనర్లు పట్టుబడిన సంఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వారిని నాంపల్లిలోని 5వ ఏసీఎంఎం కోర్టు న్యాయమూర్తి ముందు హాజరుపర్చగా అందులో 6 మంది మైనర్లను సైఫాబాద్‌లోని జువైనల్ హోంలో మూడు రోజుల పాటు సామాజిక సేవ చేయాలని, మరో నలుగురికి నలుగు రోజుల పాటు సామాజిక సేవ చేయాలని, మరో ఇద్దరికి 7 రోజుల పాటు సామాజిక సేవ చేయాలని న్యాయమూర్తి తెలిపినట్లు తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధు బాబు తెలిపారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**మలక్‌పేట, జూన్ 11 ప్రభాతవార్త :**
ద్విచక్ర వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ కె.సైదులు తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం మధ్యాహ్నం మలక్‌పేట గంజి నుండి అక్షయ హోటల్ వైపు రోడ్డు దాటుతుండగా టూవీలర్ వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురికి తరలించారు. సంబంధిత వివరాలకు 871266 0520 సెల్‌ఫోన్‌లో సంప్రదించాలని తెలిపారు.

**టూ వీలర్ వాహనదారుడిపై కేసు నమోదు**
రోడ్డు దాటుతున్న వ్యక్తిని వాహనంతో ఢీకొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కె.సైదులు తెలిపారు. గ్రూప్ -1 వరీక్ష రాసి అశోక్‌నగర్‌కు వెలుతున్న రాజారామ్ (28) అతను కూడా గాయాలై యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రజయ్ గుల్మోహార్ కాలనీలో దొంగల బీభత్సం...

**-ఐదు ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీ**

**హయత్‌నగర్, జూన్ 11 ప్రభాతవార్త:** హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్ గ్రామం ప్రజయ్ గుల్మోహార్‌లో దోపిడి దొంగలు మరోసారి బీభత్సం సృష్టించారు. సోమవారం రాత్రి దుండగులు గేటెడ్ కమ్యూనిటీ సోలార్ ఫెన్సింగ్ వైర్లను కట్‌చేసి వరుసగా ఐదిళ్ల తాళాలు పగులగొట్టారు. గణేష్‌సింగ్ అనేవ్యక్తి సోమవారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లగా ఆఇంట్లోకి చొరబడిన దుండగులు బీరువాను పగులగొట్టి అందులోని అరకిలో వెండి ఆభరణాలు, 5వేల నగదును అపహరించుకుపోయారు. పక్కనున్న నాలుగిళ్లల్లో విలువైన వస్తువులు ఏమీ కన్పించకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. గతేడాది సైతం ఇలానే సోలార్ ఫెన్సింగ్ కట్‌చేసి 6 ఇళ్ల తాళాలు పగులగొట్టారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు సీసీకెమెరా పుటేజీల ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు యత్నిస్తామన్నారు. కాగా... ప్రజయ్ గుల్మోహార్ గేటెడ్ కమ్యూనిటీకి రాత్రివేళలో సెక్యూరిటీ పహారా ఉండడం... తాళం వేసిన ఇళ్లనే దుండుగులు లక్ష్యంగా చేసుకోవడంపై పలు అనుమానాలున్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఇందిరమ్మ కాలనీలో మంచినీటి ఇబ్బందులు

**- మంచినీరివ్వండి... బిల్లులు చెల్లిస్తామంటున్న మహిళలు**

**నార్సింగి, జూన్ 11 ప్రభాతవార్త :**
బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో మంచినీటి ఇబ్బందులు తీవ్రరూపం దాల్చాయని మహిళలు ఆందోళన నిర్వహించారు. అటుగా వెళ్తున్న వాటర్ లైన్‌మెన్‌ను ఘేరావ్ చేశారు. వేసవి కాలం ముగిసినా మంచినీటి సరఫరాను చేయలేక అధికారులు చేతులెత్తేశారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెలకు కేవలం 3,4సార్లు వదిలితే ఎలా తాగాలి? ఎలా వాడుకోవాలని మహిళలు మండి పడ్డారు. మా కాలనీకి సమీపంలోనే బడాబాబులుంటున్న విల్లాలకు మాత్రం వారానికి మూడుసార్లు వదులుతూ మా గరీబోళ్లకు మాత్రం నెలకు మూడు మార్లు వదులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేము మనుషులం కాదా? విల్లాల్లో ఉండే వారే మనుషులా? మేము ఆస్థి పన్నులు చెల్లించడం లేదా? మంచినీటి బిల్లులు చెల్లించడం లేదా? అని కన్నీళ్లపర్యాంతమయ్యారు. పాలకులు, అధికారుల వైఫల్యం వల్లనే మాకీ దుస్థితి దాపురించిందని వాపోయారు. రాష్ట్ర రాజధానిని ఆనుకొని ఉన్న మా ఇందిరమ్మ కాలనీలో మంచినీటి ఇబ్బందులు ఇంత దారుణంగా ఉన్నాయంటే మారుమూల గ్రామాలలో ఉంటున్న ప్రాంతాలకు ఏ రీతిన వదులుతున్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. అనేకమార్లు స్థానిక రాజకీయ నాయకులు, జల మండలి అధికారులను కలిసి మాకు మంచినీళ్లు ఇవ్వండి మహాప్రభో అంటూ మొరపెట్టుకున్నా ఎవరూ స్పందించడం లేదని పేర్కొన్నారు. మా ఓట్లతోనే అధికారంను అనుభవిస్తున్న నాయకులు, మేము చెల్లించే పన్నులతో జీతాలు పొందుతున్న అధికారులు మా సమస్యలు పరిష్కరించడంలో తాత్సారం చేయడం దారుణమని మండి పడ్డారు. ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా, మా స్థానిక నాయకులు పార్టీలు మారినా మా సమస్యలు మాత్రం తీరడం లేదని ఇందిరమ్మ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సవ్యంగా నీటిని సరఫరా చేస్తే నీటి బిల్లులు చెల్లించేందుకు మేము సిద్దంగా ఉన్నామని, నీరివ్వకుండా రూ.10.వేలు కట్టాలని బిల్లులు పంపితే ఎలా కట్టామని ప్రశ్నించారు. మేము పాచిపనులు చేసుకునే వారమని, నీరు రాకపోవడంతో స్నానాలు, మల మూత్ర విసర్జనలు చేసుకునేందుకు నరకయాతన పడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులుగాని, నాయకులు గాని స్పందించి మా ఇందిరమ్మ కాలనీకి మంచినీటిని సరఫరా చేయించాలని మహిళలు కోరారు.



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న మహిళలు

## మాతాజీనగర్ ఎఫ్ టీ ఎల్ లో అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలి

**-ప్రజావాణీలో ఫిర్యాదు చేసిన బిజెపి నేతలు,మాతాజీనగర్ బస్తీ వాసులు**

**బేగంపేట జూన్ 11,ప్రభాతవార్త**
బేగంపేట మాతాజీ నగర్ హుస్సేన్ సాగర్ ఎఫ్ టీ ఎల్ లో నిర్మించిన అక్రమ నిర్మాణాలు,ప్రార్ధనా మందిరాన్ని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ప్రజావాణీలో మాతాజీనగర్ బస్తీ కమిటీ అధ్యక్షులు నరేష్, బీ జే పీ నేత నెమలి ఆనంద్ (నందు') నేతృత్వంలో మహిళలు,బస్తీవాసులు పెద్ద సంఖ్యలో ప్రజా భవన్‌కు తరలి వచ్చి ప్రజావాణీ అధికారులకు ఫిర్యాదు చేసారు.ఈ సందర్భంగా బీ జే పీ నాయకులు నెమలి ఆనంద్ మాట్లాడుతూ మాతాజీ నగర్ బస్తీకి ఆనుకొని ఉన్న సర్వేనెంబర్ 194 బై 8 బై 1లో 10ఎకరాల 20 గుంటల స్థలం ఉందని,ఇది ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ గతంలో ఈ స్థలంలో చేపట్టిన నిర్మాణాలను అధికారులు కూల్చివేసారన్నారు.అయితే తాజాగా కొందరు ఈ స్థలంలో నిర్మాణాలతో పాటు ఒక ప్రార్ధనా మందిరాన్ని ఏర్పాటు చేసి మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని,వెంటనే నిర్మాణాలను కూల్చివేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామన్నారు.ఎఫ్ టీ ఎల్ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలన్నారు.ఈ విషయంలో అధికారుల నుంచి స్పందన రాకుంటే బీ జే పీ,మాతాజీ నగర్ బస్తీ వాసులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళణ చేస్తామని ఆనంద్ హెచ్చరించారు.హుస్సేన్ సాగర్ ఎఫ్ టీ ఎల్ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ ఇంటి నెంబర్లు ఎలా ఇస్తున్నారని,విద్యుత్ మీటర్లు ఎలా ఇస్తారని,ప్రజావాణీలో ఉన్న విద్యుత్‌శాఖ డీఈ సుధీర్‌ని ఆనంద్ ప్రశ్నించారు.మీటర్లు ఎలా ఇచ్చారో తాను తెల్సుకుని వాటి కాపీలను అందిస్తానంటూ ఆనంద్ తదితరులకు వివరించారు.ఈ కార్యక్రమంలో బేగంపేట బీ జే పీ డివిజన్ అధ్యక్షులు గోవింద్ ,ప్రధాన కార్యదర్శి మైసూర్ మధు,టీ.శ్రావణ్‌కుమార్, పాండ్యన్,ప్రమోద్,సాయిలు,చంద్రకళ,లక్ష్మణ్,సునీత,శోభ,కృష్ణ,మంగ,ఉషా,గంగారాం,దేవిక, ఉన్నారు.

## దావూద్ ఇబ్రహింతో సంబంధాలున్నాయంటూ ఫేక్ కాల్స్

**-రిటైర్డ్ ఉద్యోగి నుంచి రూ.20లక్షలు టోకరా**

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:**
ఇటీవలె జరుగుతున్న సైబర్ మోసాలు తెలిసి కూడా ఒక రిటైర్డ్ ఉద్యోగి ఫ్రాడ్‌లు చేసేవారి మాటలు నమ్మి డబ్బు పంపించి మోసపోయాడు. అండర్ వరల్డ్‌తో సంబంధాలు, దావూద్ ఇబ్రహింతో పరిచయాలున్నాయనే కారణం చెప్పి బ్యాంకు వివరాలు అడిగిన కేటుగాళ్ళు, నిరపరాధిగా నిరూపణ అయితే తిరిగి ఇచ్చేస్తామంటూ బాధితుడి వద్ద నుంచి రూ. 20లక్షల దోపిడీకి చేశారు. నగర సైబర్ క్రైం పోలీసుల వివరాల ప్రకారం, నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి(63)కి భారత టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ(ట్రాయ్) నుంచి మాట్లాడుతున్నట్లు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి, అతడి నెంబరుని త్వరలో డీయాక్టివేట్ చేయనున్నామనీ, అసాంఘిక కార్యక్రమాలలో అతడి నెంబరును, ఆధార్ కార్డును వాడినట్లు తమ వద్ద సమాచారం ఉందంటూ చెప్పారు. అనంతరం వీడియో కాల్ చేసి రాజకీయ వేత్త నవాబ్ మాలిక్‌తోనూ, మాఫియా డాన్ దావూద్ ఇబ్రహింతోనూ నేరుగా సంబంధాలున్నాయంటూ ఆరోపణలు చేసి బాధితుడిని బెదిరించారు. అనంతరం, అతడిని ఎవ్వరితోనూ మాట్లాడవద్దని, నిర్మానుష్య ప్రదేశంలో మాత్రమే తమతో మాట్లాడమని ఆదేశించారు. అతడి పేరుమీద దావూద్ గ్యాంగ్ హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, మరో ప్రైవేటు బ్యాంకులు మూడిటిలోనూ ఖాతాలు తెరిచినట్లు చెప్పారు. తొలుత అతడి బ్యాంక్ వివరాలూ, ఖాతాలో బ్యాలెన్స్ వివరాలూ అడుగగా, బాధితుడు చెప్పడానికి నిరాకరించాడు. దాంతో నకిలీ సీబీఐ ఉత్తరువుని తయారు చేసి అందులో బాధితుడి ఆధార్ కార్డుని నేరానికి ఆపాదిస్తూ, అతడి బ్యాంకు వివరాలు కోరుతూ పంపించారు. ఈ కాల్ తరువాత ముంబై డీసీపీ పేరుతో మరో నకిలీ వ్యక్తి లైన్లోకి వచ్చాడు. సీబీఐ ఫైనాన్షియల్ అధికారితో మాట్లాడినట్టు నటించి, మనీ లాండరింగ్, ఫ్రాడ్ కేసులలో బాధితుడి పేరు ఉన్నట్లు ధృవీకరించాడు. కేసు ఇన్వెస్టిగేషన్‌లో భాగంగా బాధితుడిని బ్యాంకులో ఎంత నగదు ఉందో వివరాలు చెప్పమనీ, వాటిని గోప్యంగా ఉంచుతామని మభ్యపెట్టాడు. బాధితుడు నిరపరాధిగా నిరూపించబడితే అతడి డబ్బు మొత్తాన్ని తిరిగి పంపించేస్తామని నమ్మబలికాడు. వారి మాటలు నమ్మి మోసపోయిన ఆ రిటైర్డ్ ఉద్యోగి, ఇటీవలె జరుగుతున్న సైబర్ మోసాలు తెలిసి కూడా ఆ అగంతకులకు రూ.20 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అనంతరం వారు స్పందిచక పోగా, బాధితుడి నెంబరు బ్లాక్ చేయడంతో మోసపోయానని గ్రహించిన ఆ వృద్ధుడు మంగళవారం సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించి, బాధితుడి డబ్బు రికవరీ చేసే ప్రయత్నాల్లో ఉన్నారు.

# మలేరియా నివారణ సిబ్బంది చర్యలు

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 11, ప్రభాతవార్త**



దోమల నివారణ చర్యలు చేపడుతున్న సిబ్బంది

కూకట్‌పల్లి సర్కిల్ హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు, ప్రగతి నగర్ చెరువులో దోమల నివారణ కోసం మలేరియా ఆయిల్ బాల్స్ ను ఎంటమాలజీ సిబ్బంది మంగళవారం వదిలారు. కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ అభిలాష అభినవ్ ఆదేశాలతో కూకట్‌పల్లి జోన్ సీనియర్ ఎంటమాలజిస్ట్ సంధ్య సూచనలతో అంబీర్ చెరువు సొసైటీ మెంబర్ నగేష్, జిహెచ్ఎంసి ఎంటమాలజీ సూపర్ వైజర్ డి.నరసింహులు, సిబ్బంది కె.మురళి, జె.గిరి, ఎస్.రమేష్‌లు దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీరు నిలువలు లేకుండా చూసుకోవాలని, నీరు నిల్వ ఉంటే దోమల ఉత్పత్తికి కారణం అవుతుందని సూచించారు. పనికిరాని ఇంజన్ ఆయిల్ కానీ, కిరోసిన్ కానీ, గోనె సంచులల రంపపు చెక్కపొట్టు పోసి గుండ్రంగా రబ్బర్‌బాల్ లాగా తయారు చేసి వాటికి ఒక తాడు సాయంతో ఎక్కడైతే పెద్ద పెద్ద గుంతలు ఎక్కువ రోజులు నీరు నిలువ ఉంటాయో అక్కడ తాడు సాయంతో వాటర్‌లోకి ఆయిల్ బాల్స్ వదలాలని తెలిపారు. నిల్వ ఉన్న నీటలో ఆయిల్ ఫామ్ అయి దోమ పిల్లలు లార్వలు చనిపోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు తమ ఆవరణలో నీరు నిల్వలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా పాటించాలన్నారు. జిహెచ్ఎంసి దోమల నివారణ సిబ్బందికి ప్రతిరోజు ప్రతి ఇంటినీ తనిఖీ చేసే ఎంటమాలజీ సిబ్బందికి ప్రతి ఒక్కరు సహకరించవలసిందిగా ఎంటమాలజీ సిబ్బంది విజ్ఞప్తి చేశారు.

### కన్నులపండువగా శ్రీవేంకటేశ్వరస్వామి పంచదశ వార్షిక అధ్యయన బ్రహ్మోత్సవాలు

**నాంపల్లి, జూన్ 11 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదా యశాఖ నిర్వహణలో ఎస్‌బిహెచ్ కాలనీ వద్ద గాంధీనగర్‌లో ఉన్న అతిపు రాతన శ్రీ సంగమేశ్వరస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయంలో వారంరోజులపాటు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పంచదశ వార్షిక అధ్య యన బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. ఈ నెల 14 శుక్రవారం నుండి 19 బుధవారం వరకు వైభవోపేతంగా జరుగనున్న ఈ బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి జరిపే విశేష కైంకర్యములలో 14 శుక్రవారం రాత్రి 6 గంటల నుండి ప్రబంధ పారాయణము; 15 శనివారం ఉదయం 7గంటల నుండి సేవాకాలం, రాత్రి 7గంటల నుండి పరమ పదోత్సవము; 16 ఆదివారం ఉదయం 8గంటల నుండి ఉత్సవారంభ స్నపనం, నూత్తందాది, చాత్మర, విష్వక్సే నపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకు రారోపణం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ట, చతుస్థావర్చన, ధ్వజాది హోమం, ధ్వజా ఉత్సవం, నిర్వహిం చబతాయని, అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఆయా స్వామివారి విశేష కైంకర్య పూజాది కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొని శ్రీ వేంకటేశ్వరస్వామివారి కృపకు పాత్రులు కావాలని కార్యనిర్వహణాధికారి, ఆలయ కమిటీ కోరింది.

## నేడు పాఠశాల పునఃప్రారంభం

**-మండల విద్యాధికారి చంద్రప్ప**

**కోట్‌పల్లి, జూన్ 11, ప్రభాతవార్త;** కోట్‌పల్లి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు పున ప్రారంభం కానున్నట్లు మండల విద్యాధికారి చంద్రప్ప తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, ఉచిత యూనిఫామ్‌లను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ప్రజా ప్రతినిధులు మండల అధ్యక్షులు, జట్పీటీసీ, ఎంపీటీసీలు, తహశీల్దార్, మండల స్థాయి అధికారులు మరియు స్పెషల్ ఆఫీసర్లుచే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. తమతమ గ్రామాలల్లో బడిబాట కార్యక్రమాలను 12, తేది నుంచి 19, తేది వరకు విజయవంతం చేయాలన్నారు. బడిబాట బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించడం ప్రతి అంగాన్‌వాడీ పాఠశాలను సందర్శించి చదువుతున్న అటువంటి పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇట్టి బడిబాట కార్యక్రమం విజయవంతం చేయాలని అయన పేర్కొన్నారు.

## నేడు సర్వసభ్య సమావేశం

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 11,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో బుధవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ ప్రవీన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి నివేదికలతో విధిగా హాజరు కావాలని ఆయన సూచించాచు. అలాగే ఆయా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు సమావేశంలో పాల్గొనాలని ఆయన పెర్కోన్నారు. ఉదయం 10గంటలకు సమావేశం ప్రారంబమవుతుందని ఆయన తెలిపారు.

## పాఠశాల మరమ్మతులు నాణ్యతగా చేయాలి

**-ఎంఈవో చంద్రప్ప**

**బంట్వారం, జూన్ 11 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలను మరింత పటిష్ట పరిచెందుకుగాను ప్రభుత్వం ప్రథమ ప్రాదాన్యతగా మౌళిక వసతులను కల్పించేందుకు అధిగ నిధులను కేటాయించిదని, వాటిని సద్వినియోగం చేసుకుని పనులను నాణ్యతగా చేయాలని ఎంఈవో చంద్రప్ప సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ ను సందర్శించి పనులను పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ, ఈ పాఠశాలకు రూ 14.35 లక్షల నిధులను మంజూరు చేసిందలన్నారు. ఇందులో పాఠశాల మరమత్తులకు గాను రూ. 10.00 లక్షల, విద్యుత్‌దికరణ రూ 1.25 లక్షలు, తిటునీటి సరఫరకు రూ 1.00 లక్ష, మరుగుదొడ్ల మరమత్తులకు రూ 2.10 లక్షల మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం పనులన్ని చివరి దశలో ఉండగా, బుధవారం నాటికి పూర్తి చేయాలను చెప్పారు. కిటికిలు పూర్తిస్థాయిలో మరమత్తులు చేయాలని, అదే విదంగా మెట్లు పర్శిలతో నిర్మించాలన్నారు. అవసరమైన చోట టైల్స్‌ను ఉపయోగించాలను తెలియజేశారు. వుద్యార్థులకు ఎలాంటి లసౌకర్యం కలగ కుండా పనులు చేపట్టాలన్నారు. ఈయన వెంట హెచ్‌ఎం శ్రీనివాస్ ఉన్నారు.

## అందరికి అమలు కాని విద్యుత్ జీరో బిల్లు

**మర్పల్లి జూన్ 11 ప్రభాతవార్త :** ప్రభుత్వం అమలు చెస్తున్న గృహాలక్ష్మి పథకం కింద 200 యునిట్ల వరకు గృహలకు జీరో బిల్లు అమలు చేస్తున్న మహబుబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సందర్బంగా ఎక్కడ అమలు కాలెదు ,ఈ నెల జీరో బిల్లు అమల్లోకి వచ్చిన సగం మంది లబ్దిదారులకు జీరో బిల్లు రాలేదు.మర్పల్లి మండల కేంద్రం లోని సుమారు 800 మందికి జీరో బిల్లు అమలు కాలేదు జీరో బిల్లు రాని లబ్దిదారులు మాకెందుకు రాలెదని అవేదన వ్యక్తం చెస్తున్నారు.కొందరికి జీరో బిల్లు రాగా మరికొందరికి కరెంట్ బిల్లు రావడంతో అయోమయం వ్యక్తం చెస్తున్నారు. 200 యూనిట్ల లోపు విధ్యుత్ వినియోగించిన వారందరికి జీరో బిల్లు అమలు చెయలని మండల ప్రజలు కోరుతున్నారు.

## రైతుల కోసం రైతునేస్తం



పూడూరు మండలం పెద్ద ఉమ్మెంతాల్‌లో రైతులకు విత్తనశుద్ధి గురించి వివరిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ తదితరులు

**పూడూరు, జూన్ 11, ప్రభాతవార్త :** వ్యవసాయ రంగంలో రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలపై మంగళవారం రాష్ట్ర వ్యవసాయశాఖ అద్వర్యంలో రైతునేస్తం (వీడియో కాన్ఫరెన్స్)ను పూడూరు మండల రైతువేదికలో నిర్వహించారు.ఈ సందర్బంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు,పద్మశ్రీ అవార్డు గ్రహిత,రైతులు చింతల వెంకట్‌రెడ్డి,వెంకటేశ్వర్‌రావులు మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ కార్యక్రమాల్లో రైతులు తీసుకోవాల్సిన మెలకువలు జాగ్రత్తల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్,పరిగి డివిజన్ అధికారి లక్ష్మీ కుమారి,పూడూరు,పరిగి,దోమ,కుల్కచెర్ల,చౌడపూర్ మండలాల వ్యవసాయ అధికారులు,ఆయా మండలాల వ్యవసాయ విస్తరణ అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.అనంతరం మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్ గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్‌రెడ్డి కందిపొలాన్ని సందర్శించి పరిశీలించారు.ఈ సందరర్బంగా కంది విత్తనానికి ఎండ తెగులు నివారణకొరకు విత్తన శుద్ధి చేసే విధానాన్ని రైతులముందు ప్రదర్శించారు.ట్రికోడెర్మ విరిడి,సుడోమోనాస్ జీవ ఎరువులు వాడే పద్దతిని వివరించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తులసీరాం,ఎఇఓ శిరీష పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మైసమ్మ దేవతకు పూజలు

**ఆమనగల్లు, జూన్11, ప్రభాతవార్త:** మైసిగండి మైసమ్మ దేవతను మంగళవారం ఆమనగల్లు మండల వైస్‌ఎంపీపీ జక్కు అనంతరెడ్డి సన్నిహితులతో కలిసి దర్శించుకున్నారు. మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు అనంతరెడ్డిని ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం పలు కార్యక్రమాలకు ఆయన హాజరైనారు.

## త్వరగా పనులు పూర్తి చేసి ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలి

**-ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**కడ్తాల్,జూన్ 11 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో తహసిల్దార్ భవనం, కస్తూర్బాగాంధీ పాఠశాల భవన నిర్మాణం పనులు త్వరగా పూర్తిచేసి ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కడ్తాల్ మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. తహసిల్దార్ కార్యాల య భవనం పరిశీలించిన ఎమ్మెల్యే జరుగుతున్న పనులు నిర్లక్ష్యంగా జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరగా పనులు పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తెస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని అన్నారు. కస్తూర్బా గాంధీ పాఠశాలను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట పిసిసి సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, తహసిల్దార్ ముంతాజ్ బేగం, డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆట నర్సింహా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, పిఆర్ ఏఈ పరమేష్, కాంగ్రెస్ నాయకులు భాస్కర్‌రెడ్డి, చేగూరి వెంకటేష్, జహంగీర్ అలీ, వేణుగోపాల్, కిసాన్‌సెల్ బాల్‌రాజ్, శ్రీనివాస్, రాజేష్, శబ్బు పాల్గొన్నారు.

# మండలంలో రూ 2.85 కోట్ల సిసి రోడ్ల నిర్మాణం : ఎంపిపి ప్రభాకర్

**బంట్వారం, జూన్ 11 ప్రభాతవార్త:** తెలంగాణలో నూతన ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలలోనే మండలానికి సుమారు రూ 2.85 కోట్ల సిసి రోడ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంపీపీ ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి వెంకటేశంలు పేర్కొన్నారు మంగళవారం మండల పరిధిలోని రొంపల్లి అ నుబంధ గ్రామం మంగ్రాస్‌పల్లి లో సిసి రోడ్ల పనులు పరిశీలించి మాట్లాడారు. గత రెండు నెలల క్రితం మండలానికి మంజూరు అయిన నిధులతో వివిధ గ్రామాలలో సిసి రోడ్లు నిర్మించామని ప్రస్తుతం చివరి పనులు ఈరోజు మోగించడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో కొన్ని పనులు అప్పట్లో పెండింగ్లో ఉండగా వాటిని ప్రస్తుతం అధికారుల ఆదేశంతో నేడు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. మండలానికి అధిక ప్రాధాన్యతనిచ్చి స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధిక నిధులు మంజూరు చేయడం పట్ల వారు కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో మండలానికి మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఇప్పటికే తాగునీటికి సమస్య పరిష్కరించుటకు ఆయా గ్రామాల్లో నూతనంగా బోర్ల ు వేయడం జరిగిందన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే తమ



మంగ్రాస్‌పల్లి లో సిసి రోడ్ల నిర్మాణ ప నుల ు పరిశీలిస్తున్న ఎంపీపీ ప్రభార్, తదితరులు

దృష్టికి తేవాలని ఎంపీపీ చెప్పారు. ఈ కార్యక్రమంలో రొంపల్లి మాజీ సర్పంచ్ రాధా కృష్ణ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకటయ్య మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఇతర నాయకులు శ్రీనివాస్, శంకర్ తదితరులు ఉన్నారు.

# మున్సిపాలిటీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

**-తూంకుంట మున్సిపల్ కమిషనర్‌ను కాంగ్రెస్ నాయకులు కలిసి వినతి**



తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకట గోపాల్‌ను మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ నాయకులు

**శామీర్‌పేట, జూన్ 11, ప్రభాతవార్త** తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని వివిధ వార్డులలో వీధి దీపాలు (స్ట్రీట్ లైట్స్) ఏర్పాటు చేయాలని తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రంను అందజేసి కోరారు. మంగళవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ కార్యాలయంకు కాంగ్రెస్ నాయకులు విచ్చేసి మున్సిపాల్టీలోని వివిధ గ్రామాల్లో వార్డులలో వీధి దీపాలు లేక రాత్రి సమయంలో ఇబ్బందులు, ప్రమాదాలు జరుగుతున్నట్లు వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. తూంకుంట నుంచి పోతాయిపల్లి, ఎలిగలగూడెం, దేవరయాంజాల్, కొంపల్లి బ్రిడ్జివరకు, రాజీవ్‌రహదారి నుంచి హకీంపేట్ హనుమాన్ ఆలయం నుంచి స్పోర్ట్స్ స్కూల్ వరకు, రాజీవ్‌రహదారి నుంచి బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు, దేవరయాంజాల్ చత్రపతి శివాజీ విగ్రహం నుంచి జెన్వి కన్వెన్షన్ వరకు., డిఎంసి రోడ్డు నుంచి అర్కలగూడ వరకు, డిఎంసి నుంచి ప్రకృతి వెన్యూ వరకు, తాళ్లమైసమ్మ నుంచి నిమ్మలగార్డెన్ వరకు, తూంకుంట నుంచి మందాయిపల్లి వరకు, తూంకుంట నుంచి చెరువుకట్ట మీదుగ బిట్స్ ఫిలానీ వరకు, పోతాయిపల్లి శ్మశానవాటిక నుంచి మందాయిపల్లి వరకు, దేవరయాంజాల్ నుంచి రాధిక గార్డెన్ వరకు, తుర్కవాని కుంట నుంచి ఎస్‌వీఆర్ పంక్షన్‌హాల్ వరకు, హకీంపేట్ గాంధీ విగ్రహం నుంచి సింగాయిపల్లి వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి,పలువురు కాంగ్రెస్ నాయకులు కోరారు. వీధి దీపాలు సరిగ్గా లేక దొంగతనాలు, ప్రమాదాలు, ప్రజలకు ఇబ్బందులు రాత్రి సమయాల్లో ఎదురవుతున్నట్లు వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, పార్టీ నాయకులు మురళీగౌడ్, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, మురళీగౌడ్, పి.లక్ష్మి నారాయణ, హరిగోపాల్, ధర్మారెడ్డి, జగదీశ్‌గౌడ్, రాజు, దర్శన్‌గౌడ్, దుర్గయ్య, జగన్,బల్వంతరెడ్డి, ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేశ్‌గౌడ్, మధురెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు యువకుల హత్య బాధాకరం

**-జడ్పీటిసి జర్పుల దశరథ్‌నాయక్, వైస్ ఎంపిపి ఆనంద్**

**కడ్తాల్, జూన్ 11 ప్రభాతవార్త :** ఇటీవల కడ్తాల్ సమీపంలో ఉన్న బట్టర్‌ఫ్లై సిటీ వెంచర్ విల్లాలో జరిగిన ఇద్దరి యువకుల హత్య కేసులో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని జడ్పీ టిసి దశరథ్ నాయక్, వైస్ ఎంపిపి ఆనంద్ డిమాండ్ చేశారు. మండల పరిధిలో ఉన్న గోవిందాయపల్లి గ్రామానికి చెందిన శశిగారి శివగౌడ్, గుండెమోని శివగౌడ్‌లు ఇటీవల దారుణహత్యకు గురైన కుటుంబ సభ్యులను మంగళవారం మండల నాయ కులతో కలిసి జడ్పీటిసి దశరథ్‌నాయక్, వైస్ ఎంపిపి ఆనంద్‌లు పరామర్శించారు. వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇవ్వడం జరిగింది. అదేవిధంగా రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు నుండి ఇద్దరి మృతుల కుటుంబాలకు రూ. 5 వేల చొప్పున 10 వేల ట్రస్టు ఛైర్మన్ జడ్పీటిసి జర్పుల దశరథ్‌నాయక్ ఆర్థిక సహాయం అందించారు. ఈ విషయంలో రాజకీయ కోణంలో ఆలోచించకుండా మానవీయ కోణంలో ఆలోచన చేసి మృతుల కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా వారి కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కో ఆర్డినేటర్ వీరయ్య, మాజీ సర్పంచ్ హరిచం ద్‌నాయక్, పూజాదేవా, మాజీ ఉపసర్పంచ్ ఎల్లాగౌడ్, శారద, పాండు, నాయకులు యాదయ్య, రహీం, సోమయ్య, జంగయ్య, చెన్నయ్య, వెంకటయ్య, సాయిలు, నాయకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి : చైర్మన్



**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 11, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పెంచాలని చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ యంనంపేట్ శ్రీ వేంకటేశ్వర హౌసింగ్ కాలనీ సర్వేనెంబరు 137,138 గల 8 వేల గజాల స్థలంలో మున్సిపల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్బంగా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్‌కు చెందిన పార్కు స్థలంలో దాదాపు ఐదువందల మొక్కలు నాటినట్లు తెలిపారు. మున్సిపల్‌లో గతంలో నాటిన మొక్కలను పరిరక్షించడంతో పాటు ఈ దఫా పెద్ద ఎత్తున మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. అంతేగాక మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములు, పార్కు స్థలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చైర్మన్ తెలిపారు. చైర్మన్ అధ్యక్షతన జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో కమిషనర్ వేమన రెడ్డితో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కౌన్సిలర్ చింతల రాజశేఖర్, ఎస్. రవీందర్, నాయకులు నర్రీ కాశయ్య, నల్లవెల్లి శేఖర్, బి. జగన్‌మోహన్ రెడ్డి, అబ్బవతి నర్సింహ, సామల బుచ్చిరెడ్డి, సుర్వీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి..షాదీముబారక్ పేదలకు కొండంత అండ

**బొంరాస్‌పేట్, జూన్11, ప్రభావార్త :** బొంరాస్‌పేట్,దుద్యాల్ మండలాల పరిధిలో ఉన్న గామాలకు చెందిన కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు కొడంగల్ నియోజకవర్గం కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి,ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతిరెడ్డి చెతులమీదుగా 60మందికి చెక్కులను అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వార నిరుపేద కుటుంబాల మహిళాలకు పెళ్లికానుకగా ప్రభుత్వం ఆర్థికసహాయం చేయడంతో కొండంతఅండ అన్నారు.ఎన్నికల కోడ్ కారణంగా చెక్కుల పంపిణీ అలస్యం కావడం జరిగిందని మిగత లబ్ధిదారులకు కూడా త్వరలోనే చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి హేమీబాయి,తహసీల్దారు దానయ్య,డిప్యూటీ తహసీల్దార్ కావలి రవి,రెవేన్యూ సిబ్బంది ఆర్ఐ రవీందర్‌చారి,బొంరాస్‌పేట్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు నర్సిములుగౌడ్,పిఎసిఎస్ చైర్మన్ జయకృష్ణ, అంజిల్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, రాంరెడ్డి,దేశ్యానాయక్,పార్టీ నాయకులు,కార్యకర్తలు,లబ్ధిదారులు పాల్గోన్నారు.

## రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలి

**-సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య**

**చేవెళ్ల, జూన్ 11 ప్రభాతవార్త :** రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేవెళ్ల మండల కేంద్రంలోని భూ పోరాట కేంద్రం సిపిఐ కాలనీ ఫేస్ 2లో మండల సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శి ఎండి. మక్బుల్ అధ్యక్షతన చేవెళ్ల మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరై మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన హామీలలో రైతు భరోసా పథకం ప్రకారం ఎకరానికి రూ.15వేల నిధులను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఒకపక్క వర్షాలు ప్రారంభం అయినవి కాబట్టి రైతులు దుక్కులు దున్నడానికి విత్తనాలు ఎరువులు కొనుక్కోవడానికి రైతు భరోసా కింద నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలు ఎరువులు నకిలీ లేకుండా నాణ్యతగా ఉండే విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రామస్వామి, జిల్లా ఏఐటీయూసి కార్యదర్శి సత్యనారాయణ, బికెఎం యూ జిల్లా అధ్యక్షులు అంజయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, లలిత, విజయమ్మ, లత, అనసూయ, జయమ్మ, మండల ఏఐటీయూసి అధ్యక్షుడు శివ, యాదగిరి, శ్రీకాంత్, పెంటయ్య, ఎలీషా, సత్యనారాయణ, ప్రజానాట్య మండలి కళాకారుడు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## కండ్లకోయ గ్రామ మత్స్యకారుల సంఘం నూతన కమిటి ఎన్నిక

**మేడ్చల్, జూన్ 11. ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలోని కండ్లకోయ గ్రామ మత్స్యకారుల సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షుడుగా కె శ్రీకాంత్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడుగా శివ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్ ముదిరాజ్, సంఘం సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా మత్స్య కారుల సంఘం సభ్యులు, కుల పెద్దలు, మత్స్యశాఖ అధికారులు కమిటి అధ్యక్ష కార్యదర్శులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీరేణుకా ఎల్లమ్మ దేవత ఉత్సవాలు

**కొడంగల్, జూన్ 11ప్రభాతవార్త** కొడంగల్ మండలంలోని రుద్రారం గ్రామంలో వెలసిన శ్రీరేణుకా ఎల్లమ్మ దేవత ఉత్సవాలను గ్రామస్తులు వైభవంగా జరుపుకుంటున్నారు.భక్తుల ఇలవేల్పుగా కొలువుదీరిన శ్రీరేణుకా ఎల్లమ్మ దేవత ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కొడంగల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అంతకుముందు గ్రామంలో పెద్ద ఎత్తున మహిళలు తలపై బోనాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.వర్షాలు సమృద్ధిగా కురుస్తు పంటలు బాగా పండి పిలాపాలను చల్లంగా దీవించాలని గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తు మొక్కులు తీర్చుకున్నారు.ఉత్సవాల్లో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్,నందారం ప్రశాంత్,ఆనంద్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, అంబయ్యగౌడ్,సంజీవ్‌రెడ్డి,టి.సాయిలు,చిట్లపల్లి మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి,పాటిమీదిపల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కొంత మంది నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే ఎలా...?

**- జిల్లా సర్వసభ్య సమావేశంలో జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి**

**షాద్‌నగర్, జూన్ 11, (ప్రభాతవార్త) :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాలను ప్రజలకు సక్రమంగా అందించాల్సిన అధికారులు, ప్రభుత్వ సిబ్బంది ఆ పథకాలను నీరుగానే విధంగా చేసి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువస్తే ఎలా అని ఫరూఖ్‌నగర్ జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సర్వ సభ్య సమావేశం నిర్వహించడంతో ఆ కార్యక్రమానికి హాజరైన షాద్ నగర్ నియోజకవర్గ జడ్పీటీసీలు వెంకట్‌రాంరెడ్డి, తాండ్రవిశాల శ్రవణ్‌రెడ్డిలు పలు ప్రజా సమస్యలపై చర్చించి సభా దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్బంగా ఫరూఖ్‌నగర్ జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ... కొంత మంది ఆర్టీసీ సిబ్బంది మహిళలు ఉన్న చోట బస్సులను ఆపకుండా ఇష్టానుసారంగా వెళ్లిపోతున్నారని, ఈ విషయమై పలువురు మహిళలు తమ దృష్టికి తీసుకువచ్చారని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. కొంత మంది అవలంభిస్తునన తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఆర్టీసీ పనితీరు ఆయన ప్రశ్నించారు. అదేవిధంగా నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం కానుండటంతో వెంటనే ఆయా పాఠశాలల్లో స్వీపర్లను సహితం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలను వెంటనే పరిష్కారించాలని ఆయన కోరారు.

## సుస్థిరమైన సమాజ అభివృద్ధి కోసం నల్సార్‌లో అవగాహన ఒప్పందం

**శామీర్‌పేట, జూన్ 11, ప్రభాతవార్త** సుస్థిరమైన సమాజ అభివృద్ధి కోసం నల్సార్ లా యూనివర్సిటీ, క్షేత్ర ఫౌండేషన్ వారి మధ్య అవగాహన ఒప్పందం జరిగినట్లు నల్సార్ లా యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.శ్రీకృష్ణదేవరావు తెలిపారు. మంగళవారం శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో వారి మధ్య అవగాహన ఒప్పందం జరిగి పత్రాలను అందుకున్నారు. సమాజంలో క్షేత్ర స్థాయిలో వివాదాలు, సంఘర్షణలను, చర్చలు, సంభాషణల ద్వారా పరిష్కారం చేసుకోవటం దాని ద్వారా స్వపరిపాలన కోసం స్థానిక సముదాయాల సామర్థ్యాన్ని పెంపొందించటానికి కోసం ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నారు. సామాజిక సముదాయాలలో సమస్యల పరిష్కారానికి ఒక సమగ్ర పద్దతి అవసరమని ప్రాజెక్టు రూపదిద్దుకుంటుందన్నారు. క్షేత్ర సంస్థ నల్సార్‌ల మధ్య జరిగిన ఒప్పందం విద్యార్థులకు, స్థానిక సముదాయాలకు మధ్య నిరంతరం సంవాదం నేర్పి శక్తినిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సంస్థ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి (సిఇఓ) డాక్టర్ కృష్ణ ఉదయశంకర్, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేదలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వరం లాంటిది

**-ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

**పెద్దేముల్, జూన్ 11, ప్రభాతవార్త:** నిరుపేదలకు కల్యాణలక్ష్మి, శాదిముబారక్ పథకం వరం లాంటిదని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాండూరు పట్టణం, తాండూరు, పెద్దేముల్ మండలాలకు చెందిన 237 మంది లబ్దిదారులకు రూ. 2 కోట్ల 37 లక్షల 27 వేల 492 విలువైన కల్యాణలక్ష్మి, శాదిముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, శాదిముబారక్ పథకం వల్ల ఎందరో నిరుపేద కుటుంబాల ఆడపిల్లల పెళ్లి ఖర్చు భారం తగ్గిందనిఅన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రతి పేదింటి ఆడబిడ్డ మెడలో బంగారంఉండాలని ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో తులం బంగారం కూడా ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ స్వప్నపరిమళ్, తాండూరు యంపిపి అనితాగౌడ్, పెద్దేముల్ జడ్పిటిసి ధారాసింగ్, వైస్ యంపిపి మధులతశ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలుశోభారాణి, ఏ బ్లాక్ అధ్యక్షులు లొంక నర్సిములు, మాజి వైస్‌పర్సన్ రత్నమాల, కౌన్సిలర్లు నీరజాబాల్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, విజయదేవి, నాయకులుఉత్తంచంద్, మాజీ యంపిపి శరణు బసప్ప, పెద్దేముల్ సొసైటి డైరెక్టర్ ఎస్.నారాయన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండపురం గోపాల్, మంబాపూర్ గ్రామ కమిటి అధ్యక్షుడు యండి మైపూస్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించండి



వినతిపత్రం అందజేస్తున్న తాజామాజీ సర్పంచులు, కుటుంబసభ్యులు

**ఆమనగల్లు, జూన్11, ప్రభాతవార్త:** పంచాయతీలకు రావలసిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని మంగళవారం మండల గ్రామ పంచాయతీల తాజా మాజీ సర్పంచులు, కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి విన్నవించారు. అప్పులు తీసుకువచ్చి లక్షల రూపాయలు వెచ్చించి పంచాయతీలల్లో ప్రజావసరాల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, వాటికి సంబంధించిన బిల్లులు నేటికి అందక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీఓ ఛాంబర్‌లో అధికారి శ్రీలతను కలుసుకుని వినతిపత్రం అందజేశారు. పదవి విరమణ చేసి నెలలు గడుస్తున్నా నేటికి రావలసిన బిల్లులు రాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురికావలసి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాంనుంతల సోనశ్రీనునాయక్, కొత్తకుంటతండా కేతావత్ శోభచందునాయక్, చెన్నంపల్లి పబ్బతి శ్రీను, కోనాపూర్ యాదయ్య, చింతలపల్లి మంజుల యాదయ్య, సింగంపల్లి ప్రేమలత నర్సింహ్మాలు ఉన్నారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

**బొంరాస్‌పేట్, జూన్11, ప్రభాతవార్త :** ప్రాథమిక పాఠశాల పూర్యనాయక్‌తాండలో చదువుతున్న విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు రవీందర్‌గౌడ్ ఏకరూప దుస్తులను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఆమ్మ ఆదర్శ పాఠశాలలుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం విద్యుత్ పనులు,త్రాగునీరు,టాయిలేట్స్,అవసరమైన మైనర్ రిపేర్‌ల వంటి మౌళిక వసతులను పాఠశాలలు ప్రారంభంకు ముందుగానే ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు.ఈ విద్యాసంవత్సరంకు ముందుగానే పాఠ్యపుస్తకాలు,మహిళా సమాఖ్య ద్వార పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని,విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ వంటి అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ద్వార బడిఈడు పిల్లలు ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు కృషిచేస్తామన్నారు.అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్యా కేవలం ప్రభుత్వ బడిలోనే సాధ్యం అనే విషయంను తల్లిదండ్రులకు వివరించి నమోదు శాతం ను పెంచుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాకారం చంద్రశేఖర్,గౌరారం గోపాల్,ఐకేపి మహిళా సమాఖ్య విఓ చరిత,సిసి యాదయ్య,మాజీ సర్పంచ్ మేఘ్యానాయక్,పంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాశ్ తదితరులు పాల్గోన్నారు.

## నల్ల బ్యాడ్జిలు ధరించి ఏఈఓల నిరసన



నల్లబ్యాడ్జిలతో నిరసన తెల్పుతున్న ఏఈఒలు

**బొంరాస్‌పేట్, జూన్11, ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో ఉన్న రైతువేదిక దగ్గర నల్లబ్యాడ్జిలను ధరించి ఏఈఒలు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఏఈఒల సంఘం అధ్యక్షులు ఐజాక్ హెరాల్డ్ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో ఏఈఒలను అకారణంగా జీలుగా, జనుముల సబ్సిడీ విత్తనాల విషయంలో సస్పెండ్ చెయడం జరిగిందని అందుకుగాను నల్లబ్యాడ్జిలను ధరించి ఈ నిరసన తెలియజేయడం జరిగిందని అన్నారు. మండల వ్యవసాయ అధికారి చేయవలసిన లాగిన్ పనులను డీలర్‌లతో ఆన్లయిన్ చేయించడం,దానికి ఏఈఒలను బాధ్యులను చేయడం సరికాదన్నారు.లాగిన్‌తో ఏఈఒలకు సంబంధంలేదని అది పూర్తిగా మండల వ్యవసాయ అధికారి చేసుకోవాల్సిన పనులన్నారు.ఈ విషయంలో వెంటనే సమగ్ర విచారణ జరిపి దానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి మల్లేష్,వైస్ ప్రెసిడెంట్ రాజు రాథోడ్,కోశాధికారి మైహినొద్దిన్,శ్రీపతిరెడ్డి,వసీం,వినోద్,నిఖిల్,రేణుక,హేమరెడ్డి,భర్గవి,సాయివాణి,వైష్ణవి,హరిక,తదితరులు పాల్గోన్నారు.

## ఎమ్మెల్సీ మల్లన్నకు లక్ష్మాపూర్ నాయకుల అభినందనలు



లక్ష్మాపూర్ గ్రామ నాయకులు పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన తీన్మార్ మల్లన్నను కలిసి సన్మానించి అభినందించిన దృశ్యం

**శామీర్‌పేట, జూన్ 11 ప్రభాతవార్త** ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన తీన్మార్ మల్లన్నను లక్ష్మాపూర్ గ్రామ మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు లగిశెట్టి దయాదండ్ పటేల్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఆయనను కలిసి సన్మానించి అభినందించారు. మంగళవారం మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామ ఆ నాయకులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసి సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మాపూర్ గ్రామ మాజీ సర్పంచు సింగం అంజనేయులు, మున్నూరుకాపు సంఘం ప్రధాన కార్యదర్శి క్యాతం రవి, మాజీ అధ్యక్షులు సింగం నర్సింగ్‌రావు, సంఘం ప్రతినిధులు సింగం పవన్‌కుమార్, సింగం భాస్కర్, సింగం రాకేశ్, భాస్కర్, ఎల్. అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి బాగా చదవాలి

**- వైస్ ఎంపిపి రాజేష్ పటేల్**

**కొందుర్గు, జూన్ 11, (ప్రభాతవార్త) :** ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదివి ఉపాధ్యాయుల సహకారంతో గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో చేరడానికి ఎంపికైన విద్యార్థులు ఇకముందు కూడా బాగా చదివి మంచి మార్కులు సాధించాలని మండల పరిషత్ వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ కోరారు. మంగళవారం కొందుర్గులోని దళిత వాడ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై గురుకుల పాఠశాలకు ఒపికైన చిన్నారులను ఆయన శాలువలతో సన్మానించారు. విద్యార్థులు అర్హత సాధించటానికి కృషి చేసిన హెచ్‌ఎం బండారి ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డాక్టర్ అంజనేయులు, ఎంపీటీసీ ఇస్తారమ్మ, సామాజిక కార్యకర్త కె.సుధాకర్‌గౌడ్, వివిధ పార్టీ నాయకులు ఎ.మాణయ్య, సి.చంద్రశేఖర్, దుర్గని శ్రీను, బోరిగే నరేందర్, గూడ్సి పవన్‌కుమార్, రామగళ్ల శ్యాం, ఎం.పెంటయ్య, బోజిగారి శ్రీను, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రయాణికుడిపై బస్సు డ్రైవర్ దాడి

**మేడ్చల్, జూన్ 11. ప్రభాతవార్త :** ప్రయాణికుడిపై ఆర్టీసీ బస్సు డ్రైవర్ దాడి చేసిన సంఘటన మేడ్చల్‌లో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం రాజలింగం అనే ప్రయాణికుడు రామాయంపేట వెల్లడానికి మేడ్చల్ బస్‌డిపోకు వచ్చాడు. కొంత మసయం వేచి చూడగా డిపోలోకి రామాయంపేటకు వెళ్లే మేడ్చల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వచ్చి వెళుతుండగా రాజలింగం బస్సెక్కడానికి చూస్తుండగా అంతలోనే ఆ బస్సును డ్రైవర్ ముందుకు తీసుకెల్లాడు. దీంతో బస్సును ఆపకుండా వెళుతున్నావెంటని ఆ ప్రయాణికుడు బస్సు డ్రైవర్‌ను తిట్టాడు. కోపోద్రేకుడైన డ్రైవర్ బస్సును పక్కకు ఆపి దిగి వచ్చి ప్రయాణికుడిపై దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిని అతను డ్రైవర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.